www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్
6 నవంబర్ 2026
సంపుటి:4 సంచిక: 300

విశాల భారతి

తెలుగు దినపత్రిక



ఖమ్మం రైతులకు గుండెకోత

- ఖమ్మం రైతులకు వరుస తుపానుల దెబ్బ.. అర్మబ్, మురసు తుపానులతో పంటలు నాశనం
- 1,138 ఎకరాల్లో నేలకొరిగిన వరి పంట.. తడిసి మొలకెత్తే ప్రమాదంలో ధాన్యం
- జలదిగ్బంధంలో మూడు మండలాలు.. అప్పులు, పంట నష్టాలతో అన్నదాతల ఆవేదన

విశాలభారతి, స్టేట్ బ్యూరో: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో సాగునీటి కొరత, మరోవైపు వరుస తుపానులతో పంటలు దెబ్బతినడం అన్నదాతలను తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేస్తోంది.

మిగతా 2లో..

నల్లగొండ కార్పొరేషన్‌లో ‘ఇంటి దొంగలు’!

- ఫేక్ డెత్ సర్టిఫికెట్‌తో ఉద్యోగం.. రూ.10 లక్షల డీల్?
- నల్లగొండ కార్పొరేషన్‌లో వరుస అవినీతి ఆరోపణలు
- నకిలీ ఉద్యోగుల పేర్లతో జీతాల స్వాహా
- డీజిల్, ఫుడ్ బిల్లుల్లో భారీ గోల్‌మాల్
- పాత డిజిటల్ కీళ్లతో అక్రమ అప్రూవల్స్?
- రాజకీయ అండతో చర్యలకు అధికారుల వెనకడుగు?



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో వరుసగా బయటపడుతున్న అక్రమాల వ్యవహారం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. పారిశుద్ధ్య కార్మికుల జీతాల నుంచి జనన, మరణ ధ్రువపత్రాల జారీ వరకు పలు విభాగాల్లో అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనిచేయని వ్యక్తుల పేర్లతో వేతనాలు తీసుకోవడం, మున్సిపల్ వాహనాలకు కేటాయించిన డీజిల్ దుర్వినియోగం, ట్రేడ్ లైసెన్సుల పేరుతో అక్రమ వసూళ్లు వంటి వ్యవహారాలు చర్చకు వస్తున్నాయి. ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన కార్యాలయంలోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా కొందరు ఉద్యోగులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు పెరుగుతున్నాయి. కమిషనర్ స్థాయిలో చర్యలు ప్రారంభించినా విచారణలు పూర్తి కాకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కార్పొరేషన్‌లో జరుగుతున్న వ్యవహారాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది. ప్రజల పన్నులతో నడిచే సంస్థలో ఆర్థిక లావాదేవీలకు జవాబుదారీతనం లేకపోతే ప్రభుత్వ వ్యవస్థపైనే నమ్మకం తగ్గే ప్రమాదముంది.

మిగతా 3లో..

కరువు కోరల్లో తెలంగాణ


- ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో తీవ్ర కరువు
- 365 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించిన సర్కార్
- కేంద్రానికి నివేదిక పంపినా అందని స్పందన
- కరువు సాయంపై మౌనం వహించిన అమిత్ షా
- రైతుల కోసం నిధులు, అదనపు సాయం కోరిన ప్రభుత్వం
- కేంద్రం మౌనం.. బీఆర్ఎస్ విమర్శలతో సర్కార్‌కు సంకటం



తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరువు పరిస్థితులు కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారాయి. వర్షా లు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన ప్రభుత్వం, అందులో 111 మండలాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉందని కేంద్రానికి నివేదిక పంపింది. పది రోజులు గడిచినా కేంద్రం నుంచి స్పష్టమైన స్పందన రాకపోవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలంటే ఆర్థిక వనరులు అవసరం. ఇప్పటికే రైతుల నుంచి సాయం కోసం డిమాండ్లు పెరుగుతున్నాయి.

విశాలభారతి, స్టేట్ బ్యూరో: మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు పెంచింది. దీంతో రైతులను ఆదుకోవడం, కేంద్రం నుంచి నిధులు సాధించడం, రాజకీయ ఒత్తిడిని ఎదుర్కోవడం రాష్ట్ర సర్కార్‌కు ఏకకాలంలో ఎదురైన సవాళ్లుగా మారాయి. కరువు తీవ్రత పెరుగుతున్న కొద్దీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం మరింత పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి పలు కీలక ప్రతిపాదనలు పంపింది. సెప్టెంబర్ 18న అసెంబ్లీలో కరువుపై చర్చించి తీర్మానం చేసినట్లు నివేదికలో పేర్కొంది. వెంటనే కేంద్ర అధ్యయన బృందాలను పంపి పంట నష్టాన్ని అంచనా వేయాలని కోరింది. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేసింది. ఈ నిధులతో రైతులకు పంట నష్టపరిహారం, పెట్టుబడి రాయితీ, తాగునీటి సరఫరా, పశుగ్రాసం ఏర్పాట్లు చేపట్టాలని భావిస్తోంది. భూగర్భ జలమట్టాలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు అవసరమని వివరించింది. గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించే జీరామ్‌జీ పథకం కింద అదనంగా 50 రోజుల పని కల్పించాలని కోరింది. రైతులకు అవసరమైన ఎరువుల సరఫరా పెంచాలని ప్రతిపాదించింది. అయితే కేంద్ర బృందాల పర్యటన, నిధుల విడుదలపై స్పష్టత లేకపోవడంతో సహాయక చర్యల ప్రణాళిక అమలు ప్రశ్నార్థకంగా మారింది.

మిగతా 3లో..



చంద్రబాబుపై బీఆర్ఎస్ యూ టర్న్

- చంద్రబాబుపై బీఆర్ఎస్ నేతల వైఖరిలో మార్పు
- నాడు తెలంగాణ ద్రోహి.. నేడు ముందుచూపున్న నేత
- చంద్రబాబును పొగుడుతూ రేవంత్‌పై విమర్శలు
- కేసీఆర్, హరీశ్, కేటీఆర్ పాత వ్యాఖ్యలు వైరల్
- చంద్రబాబు ప్రశంసల వెనుక రాజకీయ వ్యూహం?
- ఆంధ్రా సెటిలర్ ఓట్లే బీఆర్ఎస్ టార్గెటా?

02



కారుణ్య దందా!

- ఉస్మానియా కేంద్రంగా తప్పుడు సర్టిఫికెట్లతో అక్రమ నియామకాలు
- యథేచ్ఛగా ఫేక్ ‘మెడికల్ ఇన్‌వాల్యుయేషన్’
- చేతులు మారుతున్న కోట్ల రూపాయలు
- చెల్లని సర్టిఫికెట్‌తో పదోన్నతి పొందిన.. చక్రం తిప్పుతున్న మెడికల్ రికార్డ్ అధికారి


02

కాంగ్రెస్ తెచ్చిన నీటి కష్టాలు

- నీళ్లు ఇవ్వలేమంటూ.. కమ్యూనిటీ సొసైటీల నోటీసులు
- ప్రైవేట్ ట్యాంకర్లు రాకపోవడంతో తీవ్రమైన నీటి సమస్య
- జలమండలి నీళ్లు ఏమూలకూ సరిపోకపోవడంతో అవస్థలు

03





డిస్కంపై ఇంటెలిజెన్స్ నిఘా!

- బదిలీల్లో డబ్బుల లావాదేవీలపై ఆరా
- కాంట్రాక్టుల్లో కీలక వ్యక్తులవాటాలపై సమాచార సేకరణ
- 15 రోజులుగా డిస్కం ప్రధాన కార్యాలయంలో నిఘా వర్గాలు

02

డిసెంబర్ నుంచే బ్యారేజీలకు రిపేర్లు

- కాళేశ్వరం పనులు డిసెంబర్‌లో ప్రారంభం
- బ్యారేజీలకు రూ.4,193 కోట్ల ప్రతిపాదనలు
- మరమ్మతుల ఖర్చు కాంట్రాక్టర్లదే
- గేట్ల మూసివేతతో నీటి లిఫ్టింగ్‌కు ఆటంకం
- దేవాదుల, సీతారామ ద్వారా 24.81 టీఎంసీల నీరు
- హేదుల నీటి వినియోగం 89 శాతం పెంపు

03





చోటా భాయ్ రేవంత్‌పై చర్యలు తీసుకోరా?

- ఆర్ఆర్ ట్యాక్స్‌పై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు
- చదరపు అడుగుకు రూ.200 వసూళ్లంటూ ఆరోపణలు
- మోదీ, అమిత్ షాలకు కేటీఆర్ సూటి ప్రశ్న
- హైదరాబాద్ బిల్డర్లకు ఆర్ఆర్ ట్యాక్స్ సెగ
- ఆరోపణలు చేస్తారు.. చర్యలు మాత్రం శూన్యం
- బీజేపీ, కాంగ్రెస్ మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందన్న కేటీఆర్

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ చర్చను మరింత వేడెక్కించాయి. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన బిల్డర్లు, డెవలపర్ల నుంచి ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో వసూళ్లు జరుగుతున్నాయని ఆయన

విశాలభారతి, స్టేట్ బ్యూరో: తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ చర్చను మరింత వేడెక్కించాయి. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన బిల్డర్లు, డెవలపర్ల నుంచి ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో వసూళ్లు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ప్రతి చదరపు అడుగుకు రూ.200 చొప్పున డబ్బులు వసూలు చేస్తున్నారని తన ఎక్స్ పోస్టులోపే ర్కొన్నారు. నగరంలో నిర్మాణ రంగంతో సంబంధం ఉన్నవారికి ఈ వ్యవహారం గురించి తెలుసని వ్యాఖ్యానించారు. అయితే ఈ అంశంపై కేంద్రంలోని బీజేపీ నాయకత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే విషయాన్ని

మిగతా 3లో..

ఎంత కరువొచ్చినా సాగునీరివ్వొచ్చు



- శ్రీశైలం డెడ్ స్టోరేజ్ నుంచి లక్ష ఎకరాలకు సాగునీరు: కోమటిరెడ్డి
- ఎస్ఎల్‌బీసీ పూర్తితో ఫ్లోరైడ్ సమస్యకు పరిష్కారం
- రెండేళ్లలో నల్లగొండలో మట్టి రోడ్లు లేకుండా చేస్తా
- బ్రాహ్మణ వెల్లెంల ద్వారా 35 వేల ఎకరాలకు నీరు
- ఏఎంఆర్‌పీ కాలువల లైనింగ్‌కు రూ.450 కోట్ల కేటాయింపు
- నల్లగొండ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

02

అయ్యప్ప సొసైటీలో అక్రమ దందాలు

- అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాలపై కవిత ఫైర్
- నెల రోజుల్లో చర్యలు తీసుకోకుంటే రెడ్ మార్క్
- సీఎం కుటుంబంపై అక్రమ వసూళ్ల ఆరోపణలు
- ఖానామెట్‌లో 700 అక్రమ భవనాలంటూ వ్యాఖ్యలు
- అక్రమ నిర్మాణాలపై అధికారులకు కవిత హెచ్చరిక
- ఆర్టీఐలో 18 వేల దరఖాస్తులు పెండింగ్‌లో

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

హైదరాబాద్‌లో భూములు, భవన నిర్మాణ అనుమతుల వ్యవహారంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు నగరాన్ని ఆదాయ వనరుగా మార్చుకున్నారని విమర్శించారు. బంజారాహిల్స్‌లోని టీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె, రోడ్లు, తాగునీరు, బస్తీ దవాఖానాల అభివృద్ధిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. భూముల అనుమతులు, టీడీఆర్ వ్యవహారాల్లో అక్రమాలు పెరిగాయని ఆరోపించారు. ముఖ్యంగా అయ్యప్ప సొసైటీ, ఖానామెట్ ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నెల రోజుల్లో అక్రమ భవనాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే తెలంగాణ రక్షణ సేన కార్యకర్తలతో కలిసి ఆయా

మిగతా 2లో..



GENERAL news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

డిస్కంపై ఇంటెలిజెన్స్ నిఘా!

సిటీబ్యూరో:

అధికారులపై అవినీతి ఆరోపణలు, కోట్ల రూపాయల కాంట్రాక్టుల నిర్వహణ, ఉన్నతాధికారుల నిర్ణయాలపై ప్రభుత్వ నిఘా వర్గాలు సమాచారం సేకరిస్తున్నట్లు తెలిసింది. గత పదిహేను రోజులుగా మింట్‌కాంపౌండ్‌లో డిస్కం ప్రధాన కార్యాలయంలోని రెండు బ్లాకుల్లో అన్ని అంతస్తుల్లో కొందరు మఫ్టీలో ఉన్న పోలీసులు ఉద్యోగులను కొన్ని అంశాలపై ప్రశ్నించినట్లు తెలిసింది. ఎస్పీడీసీఎల్‌లో ఉద్యోగుల బదిలీలు మొదలుకొని విజిలెన్స్ విచారణల వరకు పలు అంశాలు సంస్థకు సవాల్‌గా మారాయి. ఈ సంవత్సరం మొదట్లో బదిలీల వ్యవహారాన్ని నిరసిస్తూ ఉద్యోగ సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఆ తర్వాత ప్రభుత్వం బదిలీలపై నిషేధం ఎత్తి వేసిన తర్వాత సంస్థ సీఎండీగా జితేశ్ పాటిల్ బాధ్యతలు స్వీకరించాక ప్రత్యేక అనుమతి తీసుకుని ఇంజినీర్ల బదిలీలు చేశారు. ఈ బదిలీలపై అప్పట్లో దుమారం చెలరేగింది. ఆ తర్వాత పది నెలలుగా సుమారు రెండు వందలకు పైగా ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ప్రత్యేక పరిస్థితులు, అత్యవసరాల కోసం చేయాల్సిన బదిలీలు కాకుండా సంస్థలో ఒకరిద్దరు ముఖ్యుల వ్యక్తిగత స్వార్థంతో లక్షల రూపాయలు చేతులు మారినట్లు ప్రతీసారి బదిలీలు జరిగినప్పుడు చర్చ జరుగుతోంది. సంస్థలో జరుగుతున్న బదిలీల విషయంలో ఒకే ఆర్డర్ కాకుండా ఉద్యోగుల వ్యక్తిగత ఆర్డర్లు ఇవ్వడంతో ఇంత రహస్యంగా చేయాల్సిన అవసరం ఏంటనే ప్రశ్న తలెత్తుతోంది. నగరంలోని మెట్రోజోన్ నుంచి రంగారెడ్డి జోన్‌కు ఇటీవల జరిగిన ఒక ఏఈ ట్రాన్స్‌ఫర్ బదిలీతో పాటు అదే సమయంలో పలు సర్కిళ్లలో జరిగిన ఏఈలు, ఏడీఈల బదిలీలపై లక్షలు చేతులు మారాయని, ఫోకల్ టు ఫోకల్ బదిలీచేయొద్దంటూ నిబంధనలు ఉన్నప్పటికీ ప్రధానమైన సెక్షన్ నుంచి నగరశివారులోని కాసుల పంట పండే మరో సెక్షన్‌కు బదిలీ చేశారు.

చంద్రబాబుపై బీఆర్ఎస్ యూ టర్న్


విశాలభారతి, స్టేట్ బ్యూరో:



ఒకప్పుడు తెలంగాణ ద్రోహిగా విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు బీఆర్ఎస్ నేతలకు ముందు చూపున్న నాయకుడిగా కనిపిస్తున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ఈ మార్పు హాట్ టాపిక్‌గా మారింది. గతంలో చంద్రబాబుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన కేటీఆర్, హరీశ్‌రావు ఇప్పుడు ఆయన పాలనను ప్రశంసిస్తూ సీఎం రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేస్తున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో చంద్రబాబు చూపిస్తున్న చొరవను ఉదాహరణగా తీసుకుంటున్నారు. రాయలసీమలోని కుప్పం వరకు నీటిని తీసుకెళ్లేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలను అభినందిస్తున్నారు. అదే సమయంలో తెలంగాణలో కృష్ణా, గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శిస్తున్నారు. అయితే ఈ ప్రశంసల వెనుక కేవలం సాగునీటి అంశమే ఉందా అనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలోకి వచ్చాక మరోలా మాట్లాడటం బీఆర్ఎస్ రాజకీయ వ్యూహంలో భాగమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో చంద్రబాబుపై ఆ పార్టీ అధినేత కేసీఆర్ చేసిన విమర్శలు అప్పట్లో సంచలనం సృష్టించాయి. ముఖ్యంగా 2018 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత చంద్రబాబును తీవ్ర పదజాలంతో విమర్శించారు. తెలంగాణ నీటి హక్కులను దెబ్బతీసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. కృష్ణా జలాల్లో రాష్ట్రానికి రావాల్సిన వాటాను అడ్డుకున్నారని మండిపడ్డారు. శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలించేందుకు చంద్రబాబు హయాంలో తీసుకున్న నిర్ణయాలను తప్పుబట్టారు. తెలంగాణ ప్రాజెక్టులకు అడ్డంకులు సృష్టించారని విమర్శించారు. అప్పట్లో చంద్రబాబును రాజకీయ ప్రత్యర్థిగానే కాకుండా తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేసిన నాయకుడిగా బీఆర్ఎస్ చిత్రీకరించింది. ఇప్పుడు అదే పార్టీ నాయకులు ఆయనను పరిపాలనలో ముందుచూపున్న వ్యక్తిగా అభివర్ణించడం ఆసక్తికరంగా మారింది. ఈ మార్పు వెనుక రాజకీయ పరిస్థితులతో పాటు రేవంత్‌రెడ్డిని ఎదుర్కొనే వ్యూహం కూడా ఉందనే చర్చ జరుగుతోంది. చంద్రబాబుపై గతంలో అత్యంత ఘాటుగా స్పందించిన నాయకుల్లో హరీశ్‌రావు, కేటీఆర్ కూడా ఉన్నారు. తెలంగాణ నీటిపారుదల మంత్రిగా పనిచేసిన సమయంలో హరీశ్‌రావు పలుమార్లు చంద్రబాబు విధానాలను తప్పుబట్టారు. 2016 అక్టోబర్, 2018 నవంబర్, 2021 జూలైలో వివిధ సందర్భాల్లో కృష్ణా జలాల వివాదాన్ని ప్రస్తావిస్తూ తీవ్ర విమర్శలు చేశారు. మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు నీరు అందకుండా చేశారని ఆరోపించారు. మరోవైపు కేటీఆర్ కూడా చంద్రబాబు తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులను అడ్డుకునేందుకు కేంద్రానికి 30కి పైగా లేఖలు రాశారని విమర్శించారు. పాలమూరురంగారెడ్డి, డిండి ప్రాజెక్టులకు ఆటంకాలు కల్పించారని ఆరోపించారు. పట్టిసీమ ద్వారా గోదావరి జలాల మళ్లింపుపైనా అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కానీ ఇప్పుడు అదే కేటీఆర్ చంద్రబాబు కుప్పానికి నీటిని తీసుకెళ్లేందుకు చూపిస్తున్న పట్టుదలను ప్రశంసిస్తున్నారు. దీంతో గతంలో చేసిన విమర్శలు, ప్రస్తుతం వినిపిస్తున్న అభినందనల మధ్య ఉన్న వ్యత్యాసం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. బీఆర్ఎస్ వైఖరిలో మార్పునకు తెలంగాణలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు కూడా కారణమనే విశ్లేషణ వినిపిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిన వ్యవహారం ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ప్రాజెక్టు ప్రాంతానికి పలుమార్లు వెళ్లి ప్రభుత్వంపై విమర్శలు చేసినా ఆశించిన రాజకీయ ప్రయోజనం దక్కలేదనే అభిప్రాయం ఉంది. కన్నేపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినా పరిస్థితిలో మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరువు పరిస్థితులను బీఆర్ఎస్ ప్రధాన అంశంగా తీసుకుంది. ఏపీలో చంద్రబాబు నీటి నిర్వహణను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పనితీరుతో పోలుస్తూ విమర్శలు పెంచింది. గురువును మించిన శిష్యుడిగా చెప్పుకునే రేవంత్‌రెడ్డి సాగునీటి విషయంలో చంద్రబాబును ఆదర్శంగా తీసుకోవాలని కేటీఆర్, హరీశ్‌రావు సూచిస్తున్నారు. ఈ పోలిక ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా సామర్థ్యాన్ని ప్రశ్నించే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది. చంద్రబాబుపై బీఆర్ఎస్ నేతల ప్రశంసల వెనుక మరో రాజకీయ లెక్క ఉందనే ప్రచారం కూడా జోరందుకుంది. హైదరాబాద్‌రంగారెడ్డిమహబూబ్‌నగర్, నల్లగొండవరంగల్‌ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యం పెరిగింది. గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, ఖమ్మం, నల్లగొండ ప్రాంతాల్లో తెలుగుదేశం అభిమానులతో పాటు ఆంధ్రప్రదేశ్ మూలాలున్న ఓటర్లు గణనీయంగా ఉన్నారు. ఈ వర్గాలను ఆకట్టుకునేందుకే చంద్రబాబుపై బీఆర్ఎస్ నాయకులు సానుకూలంగా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా గ్రాడ్యుయేట్ ఓటర్లను ప్రభావితం చేయడానికి ఈ వ్యూహం ఉపయోగపడుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. మరోవైపు రేవంత్‌రెడ్డిని విమర్శించేందుకు చంద్రబాబు పాలనను ఉదాహరణగా చూపించడం కూడా రాజకీయంగా ఉపయోగపడే అవకాశముంది. ఒకప్పుడు తీవ్రంగా వ్యతిరేకించిన నాయకుడినే ఇప్పుడు ప్రశంసించడం తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు సంకేతంగా కనిపిస్తోంది. మొత్తానికి చంద్రబాబుపై బీఆర్ఎస్ ప్రేమ వెనుక అభిమానం కంటే ఎన్నికల లెక్కలే ఎక్కువగా ఉన్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.

కారుణ్య దందా!

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



క్యాన్సర్, పక్షవాతం, దీర్ఘకాలిక కాలేయ వ్యాధులు తదితర తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ.. ఉద్యోగం చేయలేని స్థితికి చేరుకున్న వారికి మాత్రమే ఈ వెసులుబాటు ఉంటుంది. దీనిని ఆసరాగా చేసుకుని కొంత మంది ఉద్యోగులు తప్పుడు సర్టిఫికెట్లతో తమ వారసులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు ఇప్పిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అటు ఫించన్ తీసుకుంటూ..ఇటు అతడి వారసుడు ఉద్యోగం పొంది, జీతం తీసుకుంటుండటంతో ప్రజా ధనం దుర్వినియోగం కావడమే కాకుండా అర్హులైన వారికి పదోన్నతులు అందడం లేదని, అర్హులైన నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు రావడం లేదని పలువురు వాపోతున్నారు. మిగతాకారుణ్య నియామకం పొందడానికి కావాల్సిన 'మెడికల్ ఇన్‌వాల్యుయేషన్' సర్టిఫికెట్ కావాలంటే రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఆరోగ్యపరంగా ఉద్యోగి విధులు నిర్వర్తించే స్తోమత ఉన్నప్పటికీ డబ్బులు ముట్టచెబితే చాలు..'ఆరోగ్య పరంగా ఈ ఉద్యోగి విధులు నిర్వర్తించడానికి అర్హుడు కాదు' అంటూ.. 'మెడికల్ ఇన్‌వాల్యుయేషన్' సర్టిఫికెట్ చేతిలోకి వస్తున్నదన్న రోపణలున్నాయి.

వైద్య రిపోర్టులను తారుమారు చేసి..

మెడికల్ ఇన్‌వాల్యుయేషన్ సర్టిఫికెట్ కావాలంటే సదరు ఉద్యోగికి వైద్యుల సూచన మేరకు అవసరమైన వైద్యపరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల్లో తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నట్లు నిర్ధారణ జరిగితే.. వాటి ఆధారంగా ఆ ఉద్యోగికి మెడికల్ ఇన్‌వాల్యుయేషన్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఈ సర్టిఫికెట్‌తో సదరు ఉద్యోగి 'అనారోగ్య రీత్యా తాను విధులు నిర్వర్తించలేనందున తన వారసుడికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని దరఖాస్తు చేసుకుంటాడు. ఈ క్రమంలో ఆ ఉద్యోగి వారసుడికి ప్రభుత్వ ఉద్యోగం లభిస్తుంది. ఈ నిబంధనలను ఆసరాగా చేసుకుని మెడికల్ రికార్డు విభాగానికి చెందిన కొందరు ఉద్యోగులు వైద్య పరీక్షల నివేదికలను తారుమారు చేసి అంటే.. మెడికల్ రిపోర్టులు సాధారణంగానే ఉన్నా, అసాధారణంగా ఉన్నట్లు మెడికల్ రిపోర్ట్‌లను తారుమారి చేసి, వాటి ఆధారంగా సదరు ఉద్యోగి విధులు నిర్వర్తించడానికి ఆరోగ్యం సహకరించదంటూ.. 'మెడికల్ ఇన్‌వాల్యుయేషన్' సర్టిఫికెట్‌ను జారీ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

తప్పుడు 'మెడికల్ ఇన్‌వాల్యుయేషన్' సర్టిఫికెట్లను సృష్టించడలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉస్మానియా మెడికల్ రికార్డ్ టెక్నీషియన్ తన పదోన్నతిని కూడా నకిలీ సర్టిఫికెట్‌తో పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీహెచ్ కార్యాలయంలో పెద్ద ఎత్తున చేతులు తడిపి, చెల్లని సర్టిఫికెట్‌తో మెడికల్ రికార్డు క్లర్క్ నుంచి మెడికల్ రికార్డు టెక్నీషియన్‌గా పదోన్నతి పొందడమే కాకుండా అర్హులైన వారు, ఉన్నప్పటికీ ఇన్‌చార్జ్ మెడికల్ రికార్డ్ ఆఫీసర్‌గా కూడా చలామణి అవుతున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎంత కరువొచ్చినా సాగునీరివ్వొచ్చు



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

నల్లగొండ జిల్లాలో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, రైతుల భవిష్యత్తును మార్చే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో ఎలాంటి కరువు పరిస్థితులు ఎదురైనా శ్రీశైలం డెడ్ స్టోరేజ్‌లో ఉన్న నీటిని సైతం వ్యవసాయ అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. అయితే ఈ లక్ష్యం సాధించాలంటే ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తి కావడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. నల్లగొండ జిల్లాను పచ్చని పంటలతో కళకళలాడే ప్రాంతంగా మార్చాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రైతులకు సాగునీటి భరోసా కల్పించడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలుగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి చేసిన వ్యాఖ్యలు జిల్లా సాగునీటి రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలోని జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బీ హేమలత వెంకటరెడ్డి, వైస్ చైర్మన్‌గా వి. శ్రీనివాస్ గౌడ్‌తో పాటు డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఛాయాదేవి నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మార్కెట్ కమిటీ పదవులు కేవలం రాజకీయ బాధ్యతలు మాత్రమే కావని, రైతుల జీవితాలతో నేరుగా సంబంధం ఉన్న కీలకమైన స్థానాలని వివరించారు. వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు, మార్కెట్ సదుపాయాలు, రైతుల సమస్యల పరిష్కారంలో పాలకవర్గ సభ్యులు చురుకైన పాత్ర పోషించాల్సి ఉంటుందని సూచించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నల్లగొండ మార్కెట్‌కు రెండో పాలకవర్గాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. రైతులకు సేవ చేసే అవకాశాన్ని అదృష్టంగా భావించి, వారి సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలని నూతన సభ్యులకు పిలుపునిచ్చారు. జిల్లా అభివృద్ధిలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు అత్యంత కీలకమైనదిగా మంత్రి అభివర్ణించారు. నల్లగొండ ప్రాంతాన్ని ఎన్నో సంవత్సరాలుగా వేధిస్తున్న ఫ్లోరైడ్ సమస్యకు పరిష్కారం చూపడంతో పాటు, వ్యవసాయానికి అవసరమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో సుమారు రెండు వేల కోట్ల రూపాయల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. అయితే గత ప్రభుత్వ హయాంలో పనులు నిలిచిపోయాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని తిరిగి ప్రారంభించిందని పేర్కొన్నారు. మధ్యలో మరోసారి పనులకు ఆటంకాలు ఎదురైనా ఇటీవల మళ్లీ పనులు మొదలై వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. ఎస్ఎల్‌బీసీ పూర్తయితే నల్లగొండ జిల్లాలో సాగునీటి పరిస్థితి గణనీయంగా మారే అవకాశం ఉంది. బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే 35 వేల ఎకరాలకు సాగునీరు అందించినట్లు మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో లక్ష ఎకరాలకు నీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. ఈ ప్రాజెక్టుల ద్వారా వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి లభిస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది. సాగునీటి ప్రాజెక్టులతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. ఏఎంఆర్పీ కాలువల లైనింగ్ పనుల కోసం 450 కోట్ల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. కాలువలు, రిజర్వాయర్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వాటి పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లు రీఛార్జ్ అవుతాయని వివరించారు. దీంతో రైతులు వర్షాలపై ఆధారపడే పరిస్థితి కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుంది. ముశంపల్లి సబ్‌స్టేషన్‌తో పాటు రహదారి నిర్మాణానికి కూడా అనుమతులు తీసుకొచ్చినట్లు మంత్రి చెప్పారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనూ వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వచ్చే రెండేళ్లలో జిల్లాలో మట్టి రోడ్లు లేకుండా చేయాలనే లక్ష్యాన్ని ప్రకటించడం గ్రామీణ మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు సూచిస్తోంది. రహదారులు, విద్యుత్, సాగునీరు వంటి అంశాలు సమగ్రంగా అభివృద్ధి చెందితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది ఏర్పడుతుందని భావిస్తున్నారు. ఇక రైతులకు ఉచిత విద్యుత్ అందించే విధానాన్ని ప్రస్తావిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రారంభమైన ఈ పథకం ప్రస్తుతం దేశంలోని అనేక రాష్ట్రాల్లో అమలవుతోందని మంత్రి గుర్తుచేశారు. రైతుల సంక్షేమానికి సంబంధించిన నిర్ణయాలు దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, మార్కెట్ కమిటీల బలోపేతం, రహదారుల నిర్మాణం వంటి అంశాలు ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉన్నాయని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ప్రకటించిన లక్ష్యాలు నిజంగా రైతులకు ఎంతవరకు ప్రయోజనం చేకూరుస్తాయన్నది ప్రాజెక్టుల పనుల వేగం, నిధుల వినియోగం, సమయానికి పూర్తయ్యే విధానంపై ఆధారపడి ఉంటుంది. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తయితే నల్లగొండ జిల్లాలో సాగునీటి భరోసా పెరగడంతో పాటు ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి కూడా కీలక ముందడుగు పడే అవకాశం ఉంది. రైతుల సంక్షేమమే కేంద్రంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొంటూ, రాష్ట్ర ప్రజలకు ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభాత్‌నగర్ కాలనీ పార్కును కాపాడుకుంటాం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ప్రభాత్‌నగర్ కాలనీ పార్కును కాపాడుకుంటామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయం మార్నింగ్ వాక్‌లో భాగంగా చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్ పార్కును ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సందర్శించి వాకర్స్ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ వందలాది మంది కాలనీవాసులకు వాకింగ్ కోసం ఉపయోగపడుతున్న ప్రభాత్‌నగర్ పార్కు మధ్యలో టిమ్స్ దవాఖాన గేటు ఏర్పాటు చేయాలన్న ఆలోచనను విరమించుకునేలా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. టిమ్స్ దవాఖాన శంకుస్థాపన సమయంలో నాడు కేసీఆర్‌ను కలిసి టిమ్స్ హాస్పిటల్ ప్రాంగణంలో పోలీస్‌స్టేషన్, చిల్డ్రన్ పార్కు, వాటర్ ట్యాంక్, సబ్‌స్టేషన్ తదితరాల కోసం స్థలం కేటాయించాలని కోరగా వారు వెంటనే స్పందించి జీవో ఇచ్చారని, అయితే ప్రభుత్వం మారిపోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఈ జీవోలను పక్కనపెట్టిందని విమర్శించారు. టిమ్స్ హాస్పిటల్ వారు పార్కును రెండుగా చేసేలా మధ్యలో గేటును ఏర్పాటు చేయకుండా అడ్డుకుంటామని, పార్కును వాకర్స్‌కు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సొంటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ త్రివేది, పవన్‌కుమార్, జయశ్రీ, గట్టు శ్రీనివాస్, రమణారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సుధాకర్, కడియం మోహన్‌రాజ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతులకు గుండెకోత!

మొదటిపేజీ తరువాయి



కొద్దిరోజుల క్రితం అర్నబ్ తుపాను సృష్టించిన బీభత్సానికి జిల్లావ్యాప్తంగా దాదాపు 1,138 ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. ఆ నష్టం నుంచి రైతులు కోలుకోకముందే మురసు తుపాను రూపంలో మరో దెబ్బ తగిలింది. చేతికొచ్చిన పంటను ఇంటికి తీసుకెళ్లే సమయంలో భారీ వర్షాలు కురవడంతో రైతుల ఆశలు నీటిపాలయ్యాయి. నెలల తరబడి కష్టపడి సాగు చేసిన పొలాలు ఇప్పుడు నీటిలో మునిగిపోయాయి. బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు వాటిని ఎలా తీర్చాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. పంట దిగుబడిపై పెట్టుకున్న ఆశలు ఒక్కసారిగా చెదిరిపోవడంతో గ్రామాల్లో రైతు కుటుంబాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. వరి, పత్తి, మిరప సాగు చేసిన రైతులకు వరుస వర్షాలు కోలుకోలేని నష్టాన్ని మిగిల్చాయి. ముఖ్యంగా కోతకు సిద్ధమైన వరి పొలాల్లో నీరు నిలిచిపోవడంతో ధాన్యం నాణ్యత దెబ్బతినే ప్రమాదం పెరిగింది. ఇప్పటికే కోసి పొలాల్లో రాశులుగా పోసిన వడ్లు వర్షాలకు తడిసిపోయాయి. నీటిలో ఎక్కువసేపు ఉన్న ధాన్యం మొలకెత్తే అవకాశం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పత్తి పంట వర్షాలకు తడిసి రంగుమారడంతో మార్కెట్‌లో ఆశించిన ధర వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. నల్లబడిన పత్తిని వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసే ప్రమాదముంది. మిరప తోటల్లోనూ అధిక తేమ కారణంగా తెగుళ్లు పెరుగుతున్నాయి. పంటను కాపాడుకోవడానికి మందులు పిచికారీ చేసినా వర్షాలు తగ్గకపోవడంతో రైతులకు అదనపు ఖర్చులు తప్పడం లేదు. దీంతో సాగు పెట్టుబడులు పెరిగి ఆదాయం తగ్గే పరిస్థితి ఏర్పడుతోంది. మధిరకు చెందిన రైతు మందడపు నాగకృష్ణ ఎదుర్కొంటున్న పరిస్థితి జిల్లాలోని అనేక మంది అన్నదాతల కష్టాలకు అద్దం పడుతోంది. నాలుగు ఎకరాల్లో మిరప సాగు కోసం సుమారు రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు ఆయన తెలిపారు. పంట చేతికొచ్చే సమయంలో తెగుళ్లు సోకడంతో తీవ్ర నష్టం ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్న రైతులకు ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు పెద్ద భారంగా మారుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు ఇప్పటికే పెరిగిపోయాయి. ఇప్పుడు పంట నష్టంతో కనీసం పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేకుండా పోతోంది. బ్యాంకు రుణాలతో పాటు ప్రైవేటుగా తీసుకున్న అప్పులకు వడ్డీలు పెరుగుతుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం వెంటనే వ్యవసాయ అధికారులను గ్రామాలకు పంపించి పంట నష్టాన్ని అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు. పరిహారం త్వరగా అందితే కొంతైనా ఆర్థిక భారం తగ్గుతుందని ఆశిస్తున్నారు. మురసు తుపాను ప్రభావం పంట పొలాలకే పరిమితం కాకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జనజీవనాన్ని సైతం అస్తవ్యస్తం చేసింది. అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి మండలాల్లో భారీ వర్షాలతో పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చండ్రుగొండ మండలం నుంచి సీతాయిగూడెం వెళ్లే ప్రధాన మార్గంలోని వంతెనపైకి వరదనీరు చేరడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. ములకలపల్లి మండలం రాజుపేట సమీపంలో పాములేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో తాత్కాలిక రహదారి కొట్టుకుపోయింది. దీంతో పాల్వంచ నుంచి దమ్మపేట వెళ్లే మార్గంలో రవాణా నిలిచిపోయింది. గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లాల్సిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పనుల కోసం బయటకు వెళ్లాల్సిన వారికి మార్గాలు మూసుకుపోవడం పెద్ద సమస్యగా మారింది. వరద ప్రవాహం తగ్గే వరకు ప్రమాదకర ప్రాంతాల్లో ప్రయాణాలు చేయవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అశ్వారావుపేట మండలంలోని పెద్దవాగు ప్రాజెక్టుకు భారీగా వరదనీరు చేరడం స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. వరద ఉధృతికి ప్రాజెక్టు రింగ్‌బండ్ తెగిపోవడంతో పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తమయ్యారు. నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు మూడు గేట్లు ఎత్తి దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో వాగు పరివాహక ప్రాంతాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఏర్పడింది. మరోవైపు వరుస తుపానులతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలనే డిమాండ్ బలపడుతోంది. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వరి, పత్తి, మిరప రైతుల నష్టాలను నమోదు చేయాలని బాధితులు కోరుతున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం, పంట రుణాల చెల్లింపులో వెసులుబాటు కల్పించడం, తెగుళ్ల నివారణకు సాంకేతిక సహాయం అందించడం వంటి చర్యలు రైతులకు ఊరట కలిగించవచ్చు. వరద ప్రభావిత గ్రామాల్లో రహదారులను పునరుద్ధరించడం, ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టడం కూడా అత్యవసరంగా మారింది.

అయ్యప్ప సొసైటీలో అక్రమ దందాలు

మొదటిపేజీ తరువాయి



భవనాలకు రెడ్ మార్క్ వేస్తామని హెచ్చరించారు. ప్రజల అవసరాల కంటే రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మండిపడ్డారు. ఈ వివాదం నగర పాలనలో పారదర్శకతపై కొత్త చర్చకు దారితీసింది. అయ్యప్ప సొసైటీలోని భూముల చరిత్రను ప్రస్తావిస్తూ కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. భూదాన్ ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం 150 ఎకరాల్లో గురుకుల ట్రస్ట్ బోర్డు ఏర్పాటైందని గుర్తుచేశారు. ఆ భూములను కాపాడేందుకు ట్రస్ట్ చైర్మన్ విఠల్ రావు గతంలో ఉద్యమాలు చేశారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఖానామెట్‌లో 500 నుంచి 700 వరకు అక్రమ భవనాలు నిర్మించారని ఆరోపించారు. ప్రస్తుతం మరో 80 నిర్మాణాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నోటరీ పత్రాల ఆధారంగా పది అంతస్తుల వరకు భవనాలు నిర్మిస్తున్నారని విమర్శించారు. సర్వే నంబర్ 11లోని 18 నుంచి 44 వరకు ఉన్న స్థలాలతో పాటు సర్వే నంబర్ 12లో పన్నెండు అంతస్తుల నిర్మాణాలను ప్రస్తావించారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ తనిఖీలు ఎందుకు చేపట్టడం లేదని నిలదీశారు. భవనాల మధ్య తగినంత ఖాళీ లేకపోవడం ప్రమాదకరమన్నారు. ఖానామెట్ నిర్మాణాల్లో అగ్నిప్రమాదాల ముప్పు ఎక్కువగా ఉందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. పలు భవనాల్లో కాలేజీలు, పీజీ హాస్టళ్లు నడుస్తున్నాయని, సెల్లార్లలో వంటశాలలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. భూగర్భ జలాల సమస్యతో అక్కడ నిర్మాణాలు చేపట్టవద్దని హైకోర్టు ఆదేశించినప్పటికీ పనులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. మరోవైపు మంథని నియోజకవర్గంలోని శాత్రాజుపల్లిలో బొగ్గు గని సర్వే పూర్తి కాకముందే అర్ధరాత్రి 374 ఇళ్లను కూల్చేశారని విమర్శించారు. పేదల విషయంలో కఠినంగా వ్యవహరిస్తూ బడా నిర్మాణదారులకు మినహాయింపులు ఇస్తున్నారని మండిపడ్డారు. అక్రమ భవనాలపై కథనాలు ప్రచురించిన మీడియా ప్రతినిధులను యజమానులు బెదిరిస్తున్నారని కూడా ఆరోపించారు. ముఖ్యమంత్రి సోదరుల సహకారంతో నిర్మాణ అనుమతులు వస్తున్నాయని వ్యాఖ్యానించారు. గల్ఫ్ ఆయిల్, ఆదిత్య బిల్డర్స్ వ్యవహారాలను ప్రస్తావిస్తూ మూసీ పరివాహక ప్రాంతంలో నిర్మాణాలపై అభ్యంతరం తెలిపారు. ఆదిత్య బిల్డర్స్ యజమాని విల్లా ఇచ్చి అనుమతులు పొందారనే ఆరోపణను కూడా వినిపించారు. ప్రభుత్వ పనితీరును ప్రశ్నించేందుకు ఉపయోగపడే ఆర్థిక వ్యవస్థ కూడా తెలంగాణలో బలహీనపడిందని కవిత విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 18 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ఒక జిల్లాలోనే 800 దరఖాస్తులకు ఒకేరోజు సమాధానం ఇవ్వలేమని అధికారులు చెప్పారని పేర్కొన్నారు. అయ్యప్ప సొసైటీ భూములు, నిర్మాణ అనుమతులపై తాను అడిగిన వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఖానామెట్‌లో సమగ్ర సర్వే నిర్వహించి అనుమతులు లేని భవనాలు, అదనపు అంతస్తులు, అగ్నిమాపక భద్రతా లోపాలపై చర్యలు చేపట్టాలన్నారు. నోటరీ ఆధారంగా జరుగుతున్న రిజిస్ట్రేషన్లను రిజిస్ట్రేషన్ల శాఖ తనిఖీ చేయాలని కోరారు. నిజమైన భూ యజమానుల హక్కులను కాపాడతామని ప్రకటించారు. వివాదాస్పద స్థలాలను కొనుగోలు చేసి ప్రజలు ఇబ్బందుల్లో పడవద్దని సూచించారు. నెలరోజుల గడువులో చర్యలు లేకపోతే తమ పార్టీ తరఫున రెడ్ మార్క్ కార్యక్రమం చేపడతామని స్పష్టం చేశారు. భూవివాదాలకు శాశ్వత పరిష్కారం అవసరమన్నారు. రాష్ట్ర రాజకీయాలపైనా కవిత విమర్శలు కొనసాగించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనలో కరువు సమస్యను ప్రస్తావించలేదని మండిపడ్డారు.

నల్లగొండ కార్పొరేషన్‌లో 'ఇంటి దొంగలు'!



మొదటిపేజీ తరువాయి

కార్పొరేషన్‌లో అత్యంత వివాదాస్పదంగా మారిన అంశం నకిలీ మరణ ధ్రువపత్రంతో ఉద్యోగం పొందిన వ్యవహారం. రిటైర్డ్ హెల్త్ అసిస్టెంట్ చామకూరి వెంకటేశ్వర్లు పదవీ విరమణ తర్వాత మరణించగా, ఆయన ఉద్యోగంలో ఉన్నప్పుడే చనిపోయినట్లు ధ్రువపత్రం జారీ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ పత్రంతో పాటు నకిలీ ఆధార్ కార్డును ఉపయోగించి ఆయన కుమారుడు రాజు వైద్య ఆరోగ్య శాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా కారుణ్య నియామకం పొందినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంలో సుమారు రూ.10 లక్షల వరకు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది. గత కమిషనర్‌తో పాటు కొందరు ఉద్యోగుల పాత్రపైనా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ ఈ ఘటనపై చర్యలకు ఉపక్రమించారు. మృతుడి భార్య వసంత, ఒక హెడ్ కానిస్టేబుల్ సహా నలుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిఫార్సు చేశారు. దీంతో ధ్రువపత్రాల జారీ వ్యవస్థలో ఉన్న లోపాలు బయటకు వచ్చాయి. నకిలీ మరణ ధ్రువపత్రం వ్యవహారంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ రెడ్డి, వార్డ్ ఆఫీసర్ జనార్దన్, శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ అబ్దుల్ ఖాదీర్, కంప్యూటర్ ఆపరేటర్ మహ్మద్ సమీకి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. సమగ్ర విచారణకు ఆదేశించినప్పటికీ ప్రక్రియ ఆలస్యమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో కార్పొరేషన్‌లో డిజిటల్ లాగిన్ కీల వ్యవహారం మరో వివాదానికి దారితీసింది. గతంలో పనిచేసి బదిలీ అయిన కమిషనర్ల డిజిటల్ లాగిన్ వివరాలు ఇప్పటికీ కొందరు సిబ్బంది వద్ద ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. వాటిని ఉపయోగించి అధికారుల బదిలీల సమయంలో అనధికారిక అనుమతులు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ సేవలను డిజిటల్ విధానంలోకి మార్చినా పాత లాగిన్ వివరాలు కొనసాగితే దుర్వినియోగానికి అవకాశం ఏర్పడుతుంది. అందుకే ప్రతి డిజిటల్ అనుమతికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేయడం కీలకంగా మారింది. గతంలో జరిగిన ఇలాంటి ఘటనలపై చర్యలు లేకపోవడం కూడా చర్చనీయాంశమైంది. నల్లగొండ కార్పొరేషన్‌లో డీజిల్ వినియోగం, ఎన్నికల ఖర్చుల వ్యవహారం కూడా కొత్త వివాదాలకు కారణమవుతోంది. మున్సిపల్ వాహనాల కోసం కేటాయించిన ఇంధనాన్ని ఓ కీలక ఉద్యోగి వ్యక్తిగత వాహనాలకు ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డీజిల్ వినియోగాన్ని పూర్తిగా డిజిటల్ విధానంలోకి తీసుకురావడానికి కమిషనర్ ప్రయత్నిస్తుండగా సదరు ఉద్యోగి అడ్డుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు గత ఎన్నికల సమయంలో నామినేషన్ల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి భోజన ఏర్పాట్ల పేరుతో సుమారు రూ.60 లక్షల నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలోనూ అదే ఉద్యోగి పాత్ర ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ట్రేడ్ లైసెన్సుల జారీలో అక్రమ వసూళ్ల అంశం కూడా తెరపైకి వచ్చింది. వాహనాల ఇంధన బిల్లులు, ఎన్నికల ఖర్చులు, వ్యాపార అనుమతులకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలనే డిమాండ్ పెరుగుతోంది. ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయ అండదండల అంశం కూడా ప్రధాన చర్చగా మారింది. కార్పొరేషన్‌లో కీలక స్థానంలో ఉన్న ఓ ఉద్యోగికి జిల్లాకు చెందిన ప్రముఖ ప్రజాప్రతినిధితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఆ పరిచయాల కారణంగానే ఆయనపై చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనకడుగు వేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం సదరు ఉద్యోగి పేరు పదోన్నతుల జాబితాలో ఉండటంతో వివాదాస్పద ఫైళ్లను పక్కనపెడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నకిలీ ధ్రువపత్రాల జారీ, కారుణ్య నియామకం, డీజిల్ వినియోగం, ఎన్నికల ఖర్చుల వ్యవహారాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలనే డిమాండ్ బలపడుతోంది. ముఖ్యంగా గతంలో జారీ చేసిన జనన, మరణ ధ్రువపత్రాలను మరోసారి తనిఖీ చేయాల్సిన అవసరం కనిపిస్తోంది. ప్రజాధనం వినియోగంలో పారదర్శకత పెంచడంతోపాటు ఉద్యోగుల బాధ్యతలను స్పష్టంగా నిర్ణయించడం కీలకం. విచారణలను త్వరగా పూర్తి చేసి ఆధారాల ప్రకారం చర్యలు తీసుకుంటేనే కార్పొరేషన్‌పై ప్రజల్లో నమ్మకం పెరిగే అవకాశముంది.

డిసెంబర్ నుంచే బ్యారేజీలకు రిపేర్లు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ.. తెలంగాణ సాగునీటి రంగంలో ఇప్పుడు ఇదొక కీలక పరిణామంగా మారింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు ఎదురైన నిర్మాణపరమైన సమస్యలను పరిష్కరించి, ప్రాజెక్టును తిరిగి అందుబాటులోకి తీసుకురావడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో మంత్రులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో పునరుద్ధరణ పనులపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గతంలో జరిగిన తప్పిదాలు మళ్లీ పునరావృతం కాకుండా, ప్రాజెక్టు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, కేంద్ర నిపుణుల సూచనలకు అనుగుణంగా పనులను ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ నెలాఖరులోగా కేంద్రం నుంచి తుది అనుమతులు పొందడంతో పాటు, డిసెంబర్ నుంచే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించేలా స్పష్టమైన కార్యాచరణ రూపొందించారు. అంటే కాళేశ్వరం పునరుద్ధరణ విషయంలో ప్రభుత్వం ఇక నిర్ణయాలకే పరిమితం కాకుండా, పనుల ప్రారంభానికి సిద్ధమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. మూడు బ్యారేజీల పునరుద్ధరణ కోసం అధికారులు సుమారు 4,193 కోట్ల రూపాయలతో భారీ ప్రణాళికను సిద్ధం చేశారు. మేడిగడ్డ కుంగుబాటు తర్వాత జాతీయ స్థాయి నిపుణులు నిర్వహించిన అధ్యయనం ఆధారంగా ఈ ప్రతిపాదనలు రూపొందించారు. కేంద్ర నిపుణుల కమిటీ కూడా ఈ ప్రణాళికకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. అయితే ఇక్కడ ప్రభుత్వం తీసుకున్న మరో కీలక నిర్ణయం ప్రజాధనానికి సంబంధించినది. గతంలో నిర్మాణ లోపాల కారణంగా చేపట్టాల్సిన మరమ్మతుల ఖర్చును ఆయా నిర్మాణ సంస్థలే భరించాల్సి ఉంటుంది. అదనపు రక్షణ చర్యలు, భవిష్యత్తులో ప్రాజెక్టు భద్రత కోసం చేపట్టే పనులకు మాత్రమే ప్రభుత్వ నిధులు వినియోగించేలా నిర్ణయించారు. నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించడం, బ్యారేజీల భద్రతను బలోపేతం చేయడం అనే రెండు లక్ష్యాలను సమాంతరంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ విధానం అమలైతే నిర్మాణ సంస్థల బాధ్యతను నిర్ధారించడంతో పాటు, ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గించే అవకాశం ఉంటుంది. కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన లోపాలకు బాధ్యులైన సంస్థల నుంచి ఖర్చును రాబట్టడం కూడా ఇప్పుడు కీలక అంశంగా మారింది.

మేడిగడ్డ వద్ద నీరు అందుబాటులో ఉన్నప్పటికీ దానిని ఎత్తిపోసే ప్రక్రియ నిలిచిపోవడానికి ప్రధాన కారణం బ్యారేజీల మధ్య ఉన్న సాంకేతిక సమస్యలు. ఈ అంశంపై జరుగుతున్న ప్రచారానికి ఇంజనీర్లు సమీక్షలో వివరణ ఇచ్చారు. మేడిగడ్డ నుంచి నీటిని లిఫ్ట్ చేసి ఎల్లంపల్లికి తరలించాలంటే మధ్యలో ఉన్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను మూసివేయాల్సి ఉంటుంది. కానీ ఈ రెండు బ్యారేజీల్లో నిర్మాణపరమైన లోపాలు ఉన్నందున వాటి గేట్లను మూసివేయకూడదని ఎన్‌డీఎస్‌ఏ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. గేట్లను పూర్తిగా తెరిచి ఉంచాలని సూచించింది. ఈ సూచనలను పట్టించుకోకుండా గేట్లు మూసివేస్తే బ్యారేజీల భద్రతకు తీవ్ర ముప్పు ఏర్పడే అవకాశం ఉందని అధికారులు వివరించారు. అందువల్ల మేడిగడ్డ వద్ద నీరు ఉన్నా, దానిని ఎత్తిపోసే ప్రక్రియ సాంకేతికంగా సాధ్యం కావడం లేదని స్పష్టం చేశారు. ఈ పరిణామం కాళేశ్వరం ప్రాజెక్టులోని సమస్యలు ఒక్క బ్యారేజీకి మాత్రమే పరిమితం కాలేదని, మొత్తం వ్యవస్థ పునరుద్ధరణ అవసరాన్ని తెలియజేస్తోంది. నీటి లభ్యత ఉన్నంత మాత్రాన దానిని వినియోగించుకోలేని పరిస్థితి సాగునీటి ప్రణాళికలో భద్రత ఎంత ముఖ్యమో స్పష్టం చేస్తోంది. ఇక కాళేశ్వరం బ్యారేజీల సమస్యల మధ్య గోదావరి జలాలను ఇతర ఎత్తిపోతల పథకాల ద్వారా వినియోగించుకోవడంలో ప్రభుత్వం దృష్టి పెట్టింది. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా నీటిని సమర్థవంతంగా వినియోగించినట్లు అధికారులు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో దేవాదుల ద్వారా ఏడాదికి సగటున 9.57 టీఎంసీల నీటిని మాత్రమే ఎత్తిపోసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఈ సగటు 18.13 టీఎంసీలకు చేరింది. అక్టోబర్ నాటికి దేవాదుల ద్వారా 16.71 టీఎంసీలు, సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా 8.10 టీఎంసీలు వినియోగించారు. మొత్తంగా 24.81 టీఎంసీల గోదావరి జలాలను సాగు, తాగునీటి అవసరాలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఆయకట్టుకు నీటి కొరత లేకుండా చూడటమే ఈ చర్యల ప్రధాన లక్ష్యంగా పేర్కొంది. గతంతో పోలిస్తే 89 శాతం అధికంగా గోదావరి నీటిని వినియోగించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే ఈ గణాంకాలు ప్రాజెక్టుల నిర్వహణ, నీటి పంపిణీ సామర్థ్యంపై చర్చకు కొత్త కోణాన్ని తీసుకొస్తున్నాయి. మొత్తంగా చూస్తే తెలంగాణ సాగునీటి రంగంలో ఇప్పుడు రెండు కీలక లక్ష్యాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా పునరుద్ధరించడం, మరోవైపు అందుబాటులో ఉన్న గోదావరి జలాలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రైతులకు చేరవేయడం. ఈ రెండు అంశాల్లో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రాబోయే సాగు సీజన్లపై ప్రభావం చూపనున్నాయి. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టును నిర్మించి ఉంటే తక్కువ వ్యయంతో శాశ్వత నీటి సమస్యను పరిష్కరించే అవకాశం ఉండేదని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల ఎంపిక, నిర్మాణ వ్యయం, దీర్ఘకాలిక ప్రయోజనాలపై మరోసారి చర్చకు దారితీస్తున్నాయి. కాళేశ్వరం పునరుద్ధరణకు నిర్దేశించిన డెడ్‌లైన్లు ఎంతవరకు అమలవుతాయి, నిర్మాణ సంస్థల నుంచి మరమ్మతుల ఖర్చు ఎలా వసూలు చేస్తారు, బ్యారేజీల భద్రతతో పాటు నీటి నిల్వ సామర్థ్యం ఎప్పుడు పునరుద్ధరించబడుతుంది అనే అంశాలు ఇప్పుడు అత్యంత కీలకంగా మారాయి. తెలంగాణ రైతాంగానికి గోదావరి జలాలు నిరంతరంగా అందాలంటే ప్రాజెక్టుల నిర్మాణం మాత్రమే కాదు, వాటి నిర్వహణలోనూ పారదర్శకత, బాధ్యత, సాంకేతిక భద్రత తప్పనిసరి.

కరువు కోరల్లో తెలంగాణ

మొదటిపేజీ తరువాయి



కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటన కూడా తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. సోమవారం నిర్వహించిన పాదయాత్రలో ఆయన రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, అవినీతి అంశాలపై తీవ్ర విమర్శలు చేశారు. అయితే కరువు పరిస్థితులు, రైతులకు కేంద్ర సాయం వంటి అంశాలను ప్రసంగంలో ప్రస్తావించలేదు. జాతీయ విపత్తు సహాయానికి సంబంధించిన నిర్ణయాల్లో కేంద్ర హోంశాఖ కీలక పాత్ర పోషిస్తుండటంతో ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక వెసులుబాటు కోసం అదనపు రుణానికి అనుమతి కోరింది. ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిని రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో మూడు శాతం నుంచి మూడున్నర శాతానికి పెంచాలని విజ్ఞప్తి చేసింది. విద్యుత్ అవసరాలను తీర్చేందుకు అదనంగా 1,500 మెగావాట్ల సరఫరా కోరింది. ఈ ప్రతిపాదనలపై కేంద్రం నిర్ణయం తీసుకుంటే కరువు సహాయక కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్రానికి కొంత ఊరట లభించే అవకాశముంది. తెలంగాణలో కరువు ఇప్పుడు రైతుల సమస్యగానే కాకుండా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరుగా మారింది. వర్షాభావ పరిస్థితులకు ప్రభుత్వ వైఫల్యమే కారణమన్న రీతిలో బీఆర్ఎస్ విమర్శలు చేస్తోంది. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ పాలనలో వచ్చిన కరువని ఆరోపిస్తోంది. రైతులకు నష్టపరిహారం అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడుతోంది. జిల్లాల్లో రైతు సభలు నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఇదే సమయంలో ముఖ్యమంత్రి నాలుగు రోజులు, మంత్రులు రెండు రోజులు ఢిల్లీలో నిర్వహించిన 'ఓట్ బచావో.. దేశ్ బచావో' కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని కూడా బీఆర్ఎస్ తప్పుబడుతోంది. రైతులు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం రాజకీయ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోందని విమర్శిస్తోంది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు కరువు సహాయక చర్యలు చేపట్టాల్సి ఉండగా, మరోవైపు ప్రతిపక్ష దాడిని ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణలో కొనసాగుతున్న వర్షాభావ పరిస్థితులు వచ్చే ఏడాది జులై వరకు ప్రభావం చూపే అవకాశముందనే అంచనాలు ఆందోళన పెంచుతున్నాయి. పంటలు దెబ్బతినడంతో వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల ఆదాయం తగ్గే ప్రమాదముంది. పశువులకు మేత, గ్రామాల్లో తాగునీరు, సాగుకు అవసరమైన విద్యుత్ వంటి సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశముంది. కేంద్రం నుంచి ఆర్థిక సహాయం ఆలస్యమైతే రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు భారం పడనుంది. ఇలాంటి సమయంలో అందుబాటులో ఉన్న రాష్ట్ర నిధులతో తక్షణ సహాయక చర్యలు చేపట్టడం కీలకంగా మారింది. రైతులకు పంట నష్టపరిహారం అందించడం, ఉపాధి అవకాశాలు పెంచడం, నీటి కొరతను తగ్గించడం అత్యవసరం. రాజకీయ విమర్శలకు సమాధానం ఇవ్వడంకంటే క్షేత్రస్థాయిలో ఫలితాలు చూపించడం ప్రభుత్వానికి ముఖ్యమైన పరీక్ష. కేంద్రంతో సమన్వయం కొనసాగిస్తూ అవసరమైన నిధులు సాధించగలిగితే రైతులకు కొంత ఊరట లభిస్తుంది. మొత్తానికి తెలంగాణ కరువు సమస్యకు పరిష్కారం చూపడమే ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ ముందున్న అతిపెద్ద సవాల్.



నేడు అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

ఎంపీడీవో ముత్యాలరావు

అశ్వాపురం, విశాల భారతి :

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని రైతు వేదికలో మధ్యాహ్నం రెండు గంటలకు మండల స్థాయి అధికారులతో పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీవో జి. ముత్యాలరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ సమావేశానికి మండలంలోని అధికారులందరూ వారి వారి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

చోటా భాయ్ రేవంత్‌పై చర్యలు తీసుకోరా?

మొదటిపేజీ తరువాయి



ప్రధానంగా ప్రస్తావించారు. రాజకీయ వేదికలపై భారీ ఆరోపణలు చేస్తున్న నాయకులు వాటిని అడ్డుకునేందుకు ముందుకు రావడం లేదని విమర్శించారు. దీంతో ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారం మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనల సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను కేటీఆర్ గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నారని బీజేపీ నేతలే ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. అంతటి తీవ్రమైన ఆరోపణలు చేసినప్పుడు కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. హైదరాబాద్‌లో బిల్డర్లు ఎదుర్కొంటున్న సమస్యల గురించి బీజేపీ అగ్రనాయకత్వానికి తెలియకుండా ఉండదని వ్యాఖ్యానించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నప్పటికీ రాజకీయ విమర్శలకే పరిమితమవుతోందని మండిపడ్డారు. ప్రజల ముందు కాంగ్రెస్‌ను విమర్శించడం, ఆ తర్వాత అదే అంశాన్ని పట్టించుకోకపోవడం బీజేపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని కేవలం ఎన్నికల ప్రచారానికి ఉపయోగించుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. ఆర్ఆర్ ట్యాక్స్ అంశాన్ని ప్రస్తావిస్తూ కేటీఆర్ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలు రాజకీయంగా మరింత ఆసక్తి రేపుతున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రధాని మోదీకి చోటా భాయ్‌గా అభివర్ణించిన ఆయన, బడా భాయ్ తన తమ్ముడిపై ఎలాంటి చర్యలు తీసుకోరని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి గతంలో ఏబీవీపీతో ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ సంబంధాలున్నాయనే కోణాన్ని తెరపైకి తీసుకొచ్చారు. ఒకవైపు కాంగ్రెస్ నాయకులపై తీవ్ర విమర్శలు చేస్తూనే మరోవైపు చర్యల విషయంలో బీజేపీ వెనక్కి తగ్గుతోందని ఆరోపించారు. మోదీ, అమిత్ షా హైదరాబాద్ వచ్చిన ప్రతిసారీ ఆర్ఆర్ ట్యాక్స్ గురించి మాట్లాడుతున్నారని గుర్తుచేశారు. అయితే ఆ ఆరోపణల ఆధారంగా ఎలాంటి చర్యలు చేపట్టారనే అంశంపై స్పష్టత లేదని వ్యాఖ్యానించారు. మాటల్లో చూపిస్తున్న దూకుడు చేతల్లో కనిపించడం లేదని బీజేపీ నాయకత్వాన్ని కేటీఆర్ లక్ష్యంగా చేసుకున్నారు. ఈ రాజకీయ వివాదంలో మరో కీలక అంశాన్ని కేటీఆర్ తెరపైకి తీసుకొచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ మధ్య అంతర్గత అవగాహన ఉందనే ఆరోపణలను మరోసారి బలంగా వినిపించారు. బయటకు రెండు పార్టీలు ప్రత్యర్థులుగా కనిపిస్తున్నప్పటికీ కొన్ని విషయాల్లో ఒకరికొకరు సహకరించుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారంలో చర్యలు లేకపోవడాన్ని ఇందుకు ఉదాహరణగా చూపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీజేపీ విమర్శలు చేస్తున్నా వాటిని రాజకీయ ప్రకటనల వరకే పరిమితం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే అవకాశాలు ఉన్నప్పటికీ కేంద్ర నాయకత్వం ముందుకు రావడం లేదని కేటీఆర్ పేర్కొన్నారు. దీంతో బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ అవగాహన ఉందనే తన వాదనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ అంశం ద్వారా రెండు పార్టీలను ఒకేసారి లక్ష్యంగా చేసుకోవడం బీఆర్ఎస్ వ్యూహంగా కనిపిస్తోంది. ఆర్ఆర్ ట్యాక్స్ వివాదం ఇప్పుడు కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంపైనా చర్చకు దారితీస్తోంది. చదరపు అడుగుకు రూ.200 చొప్పున వసూళ్లు జరుగుతున్నాయన్న కేటీఆర్ ఆరోపణలు నిర్మాణ రంగంలో ఆసక్తి రేపుతున్నాయి. ఇలాంటి అదనపు ఖర్చులు నిజంగా ఉంటే చివరకు ఇళ్ల కొనుగోలుదారులపై కూడా ఆర్థిక భారం పడే అవకాశముంది. నిర్మాణ వ్యయం పెరిగితే ఫ్లాట్లు, అపార్ట్‌మెంట్ల ధరలపైనా ప్రభావం కనిపించవచ్చు. మరోవైపు ఈ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడంతో పాటు కేంద్రంలోని బీజేపీ నాయకత్వాన్ని కూడా నిలదీస్తోంది. ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ఆరోపణలను ఆధారంగా చూపిస్తూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది. మొత్తానికి ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారం తెలంగాణలో మూడు ప్రధాన పార్టీల మధ్య రాజకీయ పోరును మరింత ఆసక్తికరంగా మార్చింది.

కేసీఆర్ బీసీల ఆత్మ గౌరవాన్ని కాపాడితే..

- రేవంత్ రెడ్డి చీకటి జీవో జారీ చేసిండు
- ఎమ్మెల్యే గంగుల కమలాకర్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మా కడుపు నిండా అన్నం పెట్టి కాపాడారని.. కానీ బీసీ వ్యతిరేకంగా ఉన్న రేవంత్ రెడ్డి చీకటి జీవో జారీ చేసిండని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వేదిక మీదున్న మాతోపాటు ఉన్న మధుసూదనాచారి, శ్రవణ్ కుమార్, విప్ వివేకానంద, ఎమ్మెల్యేలతోపాటు మేమంతా కూడా బీసీ బిడ్డలం.. ఒకసారి మీకు గత చరిత్రను పత్రికల ద్వారా ప్రజలకు చెప్పాల్సిన అవసరముందన్నారు. కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 201112 సంత్సరంలో పొన్నం ప్రభాకర్ కూడా బీసీ సంఘాల్లో తిరిగిండు.. నేను కూడా బీసీ సంఘాల్లో తిరిగానని ఎమ్మెల్యే గంగుల గుర్తు చేశారు. ఆనాడు సీఎం కిరణ్ కుమార్ ఈ హైదరాబాద్ నడిఒడ్డున బీసీ సంఘాలు సమావేశాలు ఏర్పాటు చేసుకుంటే.. మా బీసీ సంఘాలకు హోటళ్లలో కూడా మీటింగ్ ఉండదు కాబట్టి ఎక్కడన్నా చుట్టు పక్కల బీసీ సంఘాలకు 5 గుంటల భూమి ఇవ్వండి అంటే వెకిలిగా నవ్వి.. బీసీ సంఘాలకు ఒక ఆశ్రమం కావాలా..? అని నవ్విన పరిస్థితి ఉండేది. తిరుగగా తిరుగగా నాగార్జున సాగర్ రోడ్డులో 120 కిలోమీటర్ల దూరంలో 5 గుంటల భూమిని ఒక స్మశాన వాటిక పక్కన చూపించిన పరిస్థితి ఉన్నది,

ఎల్ నినో పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్

- జలసిరి కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యులు కావాలి

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు మండలంలోగల సమితి సింగారం పంచాయతీ పరిధిలో గురువారం సర్పంచ్ కలబోయిన మాధవ రావు విస్తృతంగా పర్యటించి ఎల్ నినో ప్రభావం పై అవగాహన కల్పించారు. అదేవిధంగా జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రజలందరూ ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టుకొని భూగర్భ జలాలను పెంపొందించేందుకు దోహదపడాలన్నారు. రాబోయే ఎల్ నినో ప్రభావం వల్ల వాతావరణంలో అనేక మార్పులు సంభవించి భూగర్భ జలాలు అంతరించిపోయే అవకాశం ఉన్నందున పంచాయితీ పరిధిలోని ప్రజలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న జలసిరి కార్యక్రమం ద్వారా భూగర్భ జలాలను పెంచేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టుకోవాలన్నారు. భూమిలో నీటి నిల్వలను పెంపొందించుకునేందుకు ప్రతి ఒక్కరూ ఒక బాధ్యతగా తీసుకొని ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. అలాగే వివి రాంజీ గ్రామీణ ఉపాధి పుస్తకాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఉపాధిపని అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, వార్డు సభ్యులు ఎస్కే రహీం పాషా, కార్యదర్శి జక్కుల అశోక్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తెచ్చిన నీటి కష్టాలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

నగరానికి 'జల సంక్షోభం' ముంచుకొస్తున్నది. రోజురోజుకు నీటి సమస్య తీవ్రతరమవుతున్నది. కాంగ్రెస్ సర్కార్ అనాలోచిత నిర్ణయాలతో సిటీలో నీటికి కటకట తప్పడం లేదు. ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటిపోయి.. బోర్లు వట్టిపోతున్నాయి. జలమండలి నీళ్లు ఏ మూలకు సరిపోవడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం.. ప్రైవేట్ బోర్లను సీజ్ చేయడం.. ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా సరఫరాను అనుమతించకపోవడం వంటి చర్యలతో నగరవాసులు నీటి కోసం నానా ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ముఖ్యంగా ప్రైవేట్ ట్యాంకర్ల నిలిపివేత.. వెస్ట్ సిటీపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఈ ప్రాంతాల్లోని గేటెడ్ కమ్యూనిటీల్లో బోరు నీళ్లు పూర్తిగా తగ్గిపోవడంతో ప్రైవేటు ట్యాంకర్లే దిక్కుగా మారాయి. ట్యాంకర్ల యాజమాన్యాలపై సర్కార్ ఆంక్షలు విధించడంతో గేటెడ్ కమ్యూనిటీల సొసైటీలు నీట సరఫరా షట్‌డౌన్ ప్రకటిస్తున్నాయి. రోజులో కొద్ది గంటలు మాత్రమే నీటి సరఫరా ఉంటుందని ఆయా సొసైటీల వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పంపిస్తున్నారు. నీటి ఎద్దడి ఏర్పడే అవకాశముంటుందని, సన్నద్ధం కావాలంటూ.. ప్రత్యేకంగా సర్క్యులర్లు జారీ చేస్తూ.. గేటెడ్ కమ్యూనిటీల నోటీసు బోర్డుల్లో ఉంచుతున్నారు. నివాసితులంతా నీటిని అత్యంత పొదుపుగా వాడుకోవాలని సూచిస్తున్నారు. సిటీబ్యూరో, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): నగరంలో నీటి సమస్య రోజురోజుకు తీవ్రమవుతున్నది. ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో పరిస్థితి మరింత జటిలమవుతున్నది. కొద్దిరోజులుగా ప్రైవేట్ బోర్లను సీజ్ చేయడం, ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా సరఫరాను అనుమతించకపోవడంతో నీటి ఎద్దడి మరింత తీవ్రమవుతున్నది.

అక్రమ నిర్మాణానికి రెడ్ కార్పెట్!

- కళ్ళు మూసుకున్న అధికారులు
- ఆల్విన్ కాలనీ సర్కిల్–51లో నిబంధనలకు తిలోదకాలు!
- జీ+2 అనుమతులతో జీ+4, పెంట్‌హౌస్.. ఇప్పుడు పెయింటింగ్‌తో ముగింపు దశకు!
- టీపీఎస్ తీరుపై స్థానికుల అనుమానాలు.. ఉన్నతాధికారులు స్పందించేదెప్పుడు?

శేరిలింగంపల్లి,విశాల భారతి

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ విభాగమే విమర్శల వలయంలో చిక్కుకుంటే పరిస్థితి ఎలా ఉంటుంది? ఆల్విన్ కాలనీ సర్కిల్-51లో ప్రస్తుతం ఇదే తరహా ప్రశ్నలు వినిపిస్తున్నాయి. జీ+2 నిర్మాణానికి అనుమతులు తీసుకుని జీ+4 అంతస్తులతో పాటు పెంట్‌హౌస్ నిర్మాణం చేపట్టినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ భవనంపై ఇప్పటికే పత్రికల్లో కథనం వెలువడింది. అయినా నిర్మాణదారుడి వేగం మాత్రం తగ్గలేదు. పైగా పెయింటింగ్ పనులు ముమ్మరంగా చేపట్టి భవనాన్ని పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తుండటం అధికారుల పనితీరుపై తీవ్ర విమర్శలకు కారణమవుతోంది.



అక్రమ నిర్మాణం బహిరంగమే.. అధికారుల స్పందన మాత్రం శూన్యం!


అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతోందన్న ఆరోపణలు, స్థానికుల ఫిర్యాదులు, పత్రికల్లో కథనాలు.. ఇన్ని పరిణామాలు చోటుచేసుకున్నా నిర్మాణ పనులు ఎందుకు ఆగడం లేదన్నది అంతు చిక్కని ప్రశ్నగా మారింది. సాధారణంగా ఇలాంటి ఫిర్యాదులు అందినప్పుడు అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి నిర్మాణ అనుమతులను తనిఖీ చేయాలి. ఉల్లంఘనలు నిర్ధారణ అయితే పనులు నిలిపివేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. కానీ ఇక్కడ మాత్రం భవనం పూర్తయ్యే దిశగా పనులు సాగుతుండటంతో అధికారుల పర్యవేక్షణపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పెయింటింగ్‌తో పాపం కడిగేసుకున్నట్లేనా?

నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న భవనానికి ప్రస్తుతం పెయింటింగ్ పనులు జరుగుతున్నాయి. నిర్మాణం పూర్తిచేసుకుని భవనానికి రంగులు వేస్తే అక్రమాలన్నీ కప్పిపుచ్చుకున్నట్లేనా? పెయింటింగ్ పూర్తయితే అధికారుల బాధ్యత ముగిసినట్లేనా? అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. నిర్మాణ అనుమతుల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాల్సిన సమయంలో భవనానికి తుది మెరుగులు దిద్దుకునే పరిస్థితి రావడం టౌన్‌ప్లానింగ్ విభాగం పనితీరుపై చర్చకు దారితీస్తోంది.

నిర్మాణదారుడికి అంత ధైర్యం ఎక్కడి నుంచి?

ఈ వ్యవహారంలో సర్కిల్-51 టౌన్‌ప్లానింగ్ విభాగానికి చెందిన టీపీఎస్‌పై స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. పెయింటింగ్ పనులు పూర్తిచేసుకుంటే ఎవరూ ఏమీ చేయలేరని, ఎవరూ నీ జోలికి రారని



నిర్మాణదారుడికి సలహాలు, సూచనలు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే అధికారుల విధుల నిర్వహణపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతాయి. ఒకవేళ ఇవి అపోహలైతే టీపీఎస్ తన వివరణతో వాటికి తెరదించాల్సిన అవసరం ఉంది. అసలు నిర్మాణదారుడికి ఎవరి అండ ఉంది? ఎవరి భరోసాతో పనులు కొనసాగిస్తున్నారన్నది ఉన్నతాధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

సామాన్యుడి ఇంటికో నిబంధన.. పెద్ద నిర్మాణానికో నిబంధనా?

సామాన్యులు చిన్న ఇల్లు నిర్మించుకోవాలన్నా అనుమతులు, సెట్‌బ్యాక్‌లు, నిబంధనల పేరుతో అధికారులు ఎన్నో అభ్యంతరాలు వ్యక్తం చేస్తుంటారు. మరి భారీ భవనాల విషయంలో మాత్రం అదే నిబంధనలు ఎందుకు గుర్తుకు రావడం లేదన్నది స్థానికుల నిలదీత. చట్టం ముందు అందరూ సమానమేనన్న సూత్రం కేవలం పేద, మధ్యతరగతి ప్రజలకే పరిమితం కాకూడదని, నిబంధనలు ఉల్లంఘించిన వారెవరైనా ఒకే విధమైన చర్యలు ఎదుర్కోవాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తయ్యాక తనిఖీలు చేస్తారా?

భవనం నిర్మాణం చివరి దశకు చేరుకున్నా అధికారులు ఇప్పటికీ స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం పూర్తయ్యాక నోటీసులు జారీ చేయడం, ఆ తర్వాత చర్యల గురించి ప్రకటనలు చేయడం వల్ల ప్రయోజనమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఉల్లంఘనలు జరుగుతున్నప్పుడే అడ్డుకోవాల్సిన అధికారులు నిర్మాణదారుడికి అవకాశం కల్పిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

టీపీఎస్‌పై ఆరోపణలు.. ఉన్నతాధికారులకు పరీక్ష!

సర్కిల్-51 పరిధిలోని ఈ నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, వాస్తవంగా నిర్మించిన అంతస్తులు, పెంట్‌హౌస్, సెట్‌బ్యాక్‌లు, ఇతర నిబంధనలపై ఉన్నతాధికారులు స్వతంత్రంగా విచారణ జరపాలి. టీపీఎస్‌పై వస్తున్న ఆరోపణల్లో వాస్తవాలు ఉన్నాయా? నిర్మాణదారుడికి ఏమైనా ప్రత్యేక సహకారం అందిందా? అనే అంశాలను కూడా పరిశీలించాలి. ఆరోపణలు నిర్ధారణ అయితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇప్పటికైనా మేల్కొంటారా.. లేక అక్రమాలకు మౌనమే సమాధానమా?

టౌన్‌ప్లానింగ్ విభాగం అంటే అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించే వ్యవస్థ కాదు.. వాటిని అడ్డుకుని పట్టణ అభివృద్ధిని క్రమబద్ధీకరించే బాధ్యత కలిగిన విభాగం. అలాంటి విభాగంపై ఆరోపణలు రావడం, వార్తలు ప్రచురితమైనా నిర్మాణ పనులు కొనసాగడం ప్రజల్లో అనేక అనుమానాలకు కారణమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘనలపై పారదర్శకంగా చర్యలు తీసుకుంటారా? లేక ఈ వ్యవహారం కూడా మరో ఫిర్యాదుగా, మరో వార్తగా మిగిలిపోతుందా? అన్నది వేచి చూడాలి.

హైదర్‌నగర్‌లో పారిశుధ్య పనులపై ఆకస్మిక తనిఖీ

- ఇంటింటి చెత్త సేకరణ తీరును పరిశీలించిన డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి
- చెత్త రవాణా వాహనాలకు కవర్లు తప్పనిసరి
- రోడ్లపై చెత్త పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం



హైదర్‌నగర్,విశాల భారతి: సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ సర్కిల్-51 హైదర్‌నగర్ గ్రామంలో పారిశుధ్య పనులను డిప్యూటీ కమిషనర్ ఈ. చాముండేశ్వరి గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ఇంటింటికీ చెత్త సేకరిస్తున్న విధానాన్ని, పారిశుధ్య సిబ్బంది పనితీరును పరిశీలించారు.ఈ సందర్భంగా చెత్త సేకరణ అనంతరం దానిని ప్రాసెసింగ్ కేంద్రాలకు తరలించే శాట్ ఆటోలకు తప్పనిసరిగా కవర్లు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. చెత్త రవాణా సమయంలో రహదారులపై వ్యర్థాలు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, ఇంటింటి చెత్త సేకరణతో పాటు చెత్త తరలింపు ప్రక్రియను కూడా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్ఆర్‌పీ, ఎస్ఎఫ్ఏ అధికారులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో లైట్‌హౌస్ కీలక పాత్ర

- ఘనంగా చందానగర్ లైట్‌హౌస్ నాలుగో వార్షికోత్సవ వేడుకలు
- 1,500 మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు
- లైట్‌హౌస్ బృందం సేవలను అభినందించిన ఉప కమిషనర్ జి. శ్రీనివాస్



సైబరాబాద్ విశాల భారతి: సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) సహకారంతో నిర్వహిస్తున్న చందానగర్ లైట్‌హౌస్ నైపుణ్య అభివృద్ధి కేంద్రం నాలుగో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, లైట్‌హౌస్ ప్రతినిధులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉప కమిషనర్ జి. శ్రీనివాస్ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ.. యువతలో నైపుణ్యాలను పెంపొందించి, వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంలో లైట్‌హౌస్ కేంద్రం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగ అనుసంధానం ద్వారా ఇప్పటివరకు 1,500 మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.గత నాలుగేళ్లుగా యువత సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న లైట్‌హౌస్ బృందాన్ని ఉప కమిషనర్ జి. శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, లైట్‌హౌస్ జాతీయ విస్తరణ విభాగం అధిపతి అతుల్, తెలంగాణ విస్తరణ విభాగం అధిపతి ఆకుల శ్రీనివాస్, చందానగర్ లైట్‌హౌస్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

క్యూర్ పరిధి అభివృద్ధికి సమన్వయమే కీలకం!

- ఎగ్జిక్యూటివ్ కమిటీ తొలి భేటీలో కీలక చర్చలు
- శాఖల మధ్య సమన్వయం, చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి



సైబరాబాద్ విశాల భారతి: క్యూర్ (CURE) పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) కార్యాలయంలో క్యూర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సర్ఫరాజ్ అహ్మద్, ఐఏఎస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హాజరయ్యారు. క్యూర్ చట్టం అమలు, పరిధిలోని ప్రాంతాల అభివృద్ధి, వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలు, ఏజెన్సీల మధ్య సమన్వయంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. అభివృద్ధి పనుల అమలులో శాఖల మధ్య సమన్వయం కీలకమని, పరస్పర సహకారంతో ముందుకు సాగాల్సిన అంశాలపై అధికారులు అభిప్రాయాలు పంచుకున్నారు.

శాఖల వారీగా సమన్వయానికి ప్రాధాన్యం..

వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల ప్రతినిధులు సమావేశంలో పాల్గొని క్యూర్ పరిధి అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. చట్టం అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాల పురోగతికి అవసరమైన సమన్వయంపై దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. శ్రీజన ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మురాసు తుఫానుతో ఇంట్లోకి వరద నీరు

- రెండు రోజులు ఇబ్బంది పడ్డ వైనం
- దరఖాస్తు చేసుకున్నా ఇల్లు మంజూరు కాలేదని నిరుపేద ఆవేదన



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి : ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ముందుగా నష్టపోయేది నిరుపేద కుటుంబాలే అన్నది జగమెరిగిన సత్యం. ఇటీవల మురాసు తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఇంట్లోకి వరద నీరు చేరడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండల కేంద్రానికి చెందిన రియాజ్ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఇంట్లోకి వరద నీరుతో కంటిమీద కునుకు లేదు

మురాసు తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు రియాజ్ నివాసం ఉంటున్న ఇంట్లోకి వరద నీరు చేరడంతో కుటుంబ సభ్యులు తీవ్ర అవస్థలు పడినట్లు తెలిపారు. ఇంట్లో ఉన్న వస్తువులు, నిత్యావసర సరుకులు తడిసిపోవడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిన ప్రతిసారీ ఇంట్లోకి నీరు వస్తుందేమోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఇందిరమ్మ ఇల్లు కోసం ఎదురుచూపులు

సొంతంగా పక్కా ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంపై రియాజ్ కుటుంబం ఆశలు పెట్టుకుంది. ఈ క్రమంలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు తమకు ఇల్లు మంజూరు కాలేదని ఆయన కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నిరుపేదలమైన తమకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

పాలకులు.. అధికారులు స్పందించాలి

ప్రభుత్వాలు నిరుపేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం అమలు చేస్తున్నప్పటికీ అర్హులైన కొందరికి ఇంకా ఇళ్ల మంజూరు కాకపోవడంతో జిల్లాలోని అర్హులైన నిరుపేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ గృహాల మంజూరి అంశంపై ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పరిశీలించాలని పలువురు కోరుతున్నారు. నిరుపేదల నుండి సంబంధిత శాఖల అధికారులు కేవలం దరఖాస్తు స్వీకరించడంతోనే బాధ్యత ముగిసిపోయింది అనకుండా క్షేత్రస్థాయిలో కుటుంబ పరిస్థితిని పరిశీలించి, అర్హతను బట్టి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రజా పాలన లక్ష్యం

- వైద్య చికిత్సకు రూ.6 లక్షల ఎల్ ఓ సి అందజేసిన ఎమ్మెల్యే



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి విశాల భారతి : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలంలోని రామానుజవరం గ్రామానికి చెందిన బొడ్డు ఉపేందర్ వైద్య చికిత్స నిమిత్తం రూ.6 లక్షల ఎల్ఓసీ ని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్స భారంగా మారకుండా ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వైద్య సహాయం అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆపద సమయంలో వారికి అవసరమైన సహాయాన్ని అందించడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

- ఎంపీడీవో ముత్యాలరావు

అశ్వాపురం, విశాల భారతి : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని రైతు వేదికలో మధ్యాహ్నం రెండు గంటలకు మండల స్థాయి అధికారులతో పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీవో జి. ముత్యాలరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ సమావేశానికి మండలంలోని అధికారులందరూ వారి వారి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఎల్‌నినో ముప్పు.. జల సంరక్షణే శరణ్యం!



- భూగర్భ జలాల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ
- ఎస్టీపీ శుద్ధి నీటి పునర్వినియోగంపై దృష్టి
- నీటి కొరతను అధిగమించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల సమన్వయానికి పిలుపు

సైబరాబాద్ - విశాల భారతి

ఎల్‌నినో ప్రభావాలతో భవిష్యత్తులో ఎదురయ్యే నీటి ఎద్దడిని ముందుగానే గుర్తించి, జల వనరుల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని వర్‌క్షాప్‌లో వక్తలు అభిప్రాయపడ్డారు. భూగర్భ జలాల సంరక్షణతో పాటు, మురుగు నీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) ద్వారా శుద్ధి చేసిన నీటిని తిరిగి వినియోగంలోకి తీసుకురావడమే భవిష్యత్తు జల సంక్షోభానికి కీలక పరిష్కారమని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావాల నివారణ, జల సంరక్షణ అంశాలపై క్రెడాయ్ హైదరాబాద్, నరెడ్కో తెలంగాణ సంస్థలు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) సహకారంతో నిర్వహించిన ప్రత్యేక వర్‌క్షాప్‌లో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎత్తైన భవనాలు, నివాస సముదాయాలు, వాణిజ్య భవనాలు, నిర్మాణ ప్రాజెక్టుల్లో తాగునీటిని వృథా చేయకుండా ప్రత్యామ్నాయ నీటి వనరులను వినియోగించడంపై ప్రధానంగా చర్చించారు. ముఖ్యంగా ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని గార్డెనింగ్, ఫ్లషింగ్, నిర్మాణ పనులు, ఇతర తాగునీటికి అవసరం లేని కార్యకలాపాలకు వినియోగించాలని సూచించారు. దీనివల్ల మంచినీటి వినియోగం తగ్గడంతో పాటు భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల కారణంగా వర్షపాతం, జల వనరులపై పడే ప్రభావాలను ముందుగానే అంచనా వేయడం, నీటి కొరత ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించడం, నీటి వినియోగంలో పొదుపు పాటించడం వంటి అంశాలపై వర్‌క్షాప్‌లో అవగాహన కల్పించారు. **సమన్వయంతోనే జల భద్రత..**

మున్సిపల్ అధికారులు, జల సరఫరా సంస్థలు, రియల్ ఎస్టేట్ డెవలపర్లు, నిర్మాణ రంగ ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే నగరంలో దీర్ఘకాలిక జల భద్రత సాధ్యమవుతుందని వక్తలు పేర్కొన్నారు. శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.బాధ్యతాయుతమైన నీటి వినియోగం, జల వనరుల పరిరక్షణ, శుద్ధి చేసిన నీటి గరిష్ఠ పునర్వినియోగం ద్వారా సుస్థిర పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఎంసీ పునరుద్ఘాటించింది.

మియాపూర్–48లో పారిశుధ్య నిర్వహణపై సమీక్ష



- క్షేత్రస్థాయిలో సమస్యల గుర్తింపు
- సత్వర పరిష్కారానికి ఉప కమిషనర్ జి. శ్రీనివాస్ ఆదేశాలు

సైబరాబాద్ - విశాల భారతి

పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టం చేసి, ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించడమే లక్ష్యంగా మియాపూర్-48 సర్కిల్, శేరిలింగంపల్లి జోన్ పరిధిలో ఉప కమిషనర్ జి. శ్రీనివాస్ అధ్వర్యంలో పారిశుధ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఈఈ (ఎస్‌డబ్ల్యూఎం), ఏఈఈ (ఎస్‌డబ్ల్యూఎం), ఎస్ఆర్‌పీలు, ఎస్ఎఫ్ఏలు, రాంకీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణలో భాగంగా ఇంటింటి చెత్త సేకరణ సమయంలో క్యూఆర్ కోడ్ స్కానింగ్, ధ్రువీకరణ ప్రక్రియను తప్పనిసరిగా పాటించాలని ఉప కమిషనర్ సూచించారు. చెత్త పేరుకుపోయే ప్రాంతాలను పూర్తిస్థాయిలో తొలగించడం, భారీగా వ్యర్థాలు ఉత్పత్తి చేసే సంస్థల నుంచి చెత్త సేకరణను పక్కాగా నిర్వహించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అదేవిధంగా పోస్టర్ రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దడం, 'నో బిన్-నో ట్రేడ్' విధానాన్ని అమలు చేయడం, నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొబ్బరి బొండాల విక్రయదారుల వివరాలను నమోదు చేసి, పారిశుధ్య నిబంధనలు పాటించేలా చూడాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని, కార్మిక బృందాల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలని జి. శ్రీనివాస్ ఆదేశించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని, వ్యాపార సంస్థలు ట్రేడ్ లైసెన్స్ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా సంబంధిత అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, సమావేశంలో చర్చించిన ప్రతి అంశంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి లక్ష్యాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఉప కమిషనర్ సూచించారు.

హెచ్‌సిటీ పనులు వేగవంతం చేయాలి

- ఫాక్స్ సాగర్ బ్రిడ్జి, కూకట్‌పల్లి జంక్షన్ల పనులపై సిఎంసీ కమిషనర్ జి. శ్రీజన సమీక్ష



సైబరాబాద్ విశాల భారతి: హెచ్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపడుతున్న కీలక మౌలిక వసతుల అభివృద్ధి పనులను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. శ్రీజన గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫాక్స్ సాగర్ వద్ద ప్రతిపాదిత బ్రిడ్జి నిర్మాణ స్థలంతో పాటు కూకట్‌పల్లి వైజంక్షన్, ఐడీఎల్ జంక్షన్‌లలో కొనసాగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు.ఫాక్స్ సాగర్ బ్రిడ్జికి సంబంధించి నవంబర్ 15లోగా భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 2027 ఫిబ్రవరి చివరి నాటికి బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. కూకట్‌పల్లి వైజంక్షన్, ఐడీఎల్ జంక్షన్ల వద్ద భూసేకరణ సమస్యలను వక్ఫ్ బోర్డు, సంబంధిత ఆస్తుల యజమానులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని స్పష్టం చేశారు.అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని కమిషనర్ జి. శ్రీజన అధికారులను ఆదేశించారు.

నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై కొరడా!

- దీప్తిశ్రీనగర్‌లో పారిశుధ్య తనిఖీలు.. వ్యాపారులకు జరిమానాలు

సైబరాబాద్ విశాల భారతి: పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమిస్తూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు చేపట్టారు. మియాపూర్ సర్కిల్-48 ఉప కమిషనర్ జి. శ్రీనివాస్ ఆదేశాల మేరకు దీప్తిశ్రీనగర్ వార్డులోని ప్రధాన రహదారిపై పారిశుధ్య అధికారులు తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా దుకాణాలు, వ్యాపార సముదాయాలను పరిశీలించగా, నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న పలువురు వ్యాపారులను గుర్తించి జరిమానాలు విధించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాన్ని వివరిస్తూ, వ్యాపారులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు నిషేధిత ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని స్పష్టం చేశారు.నిబంధనలు ఉల్లంఘించేవారిపై నిరంతర తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఉపయోగకరంగా ఏ కాంప్రహెన్సివ్ బుక్ ఆన్ ఆఫీస్ కరస్పాండెన్స్

- ఎస్తకాన్ని ఆవిష్కరించిన బిజెపి చీఫ్ రామ్ చందర్రావు



ముషీరాబాద్ విశాల భారతి: పరిపాలన విభాగంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి ఉద్యోగుల వరకు 'ఏ కాంప్రహెన్సివ్ బుక్ ఆన్ ఆఫీస్ కరస్పాండెన్స్' పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. తన నివాసంలో అబ్బూరి వెంకట రమణ రచించిన ఈ పుస్తకాన్ని గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు నుంచి ఇంగ్లీషులోకి అనువాదం చేయడంలో ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ పుస్తకం ద్వారా అనువాద ప్రక్రియ సులభతరం అవుతుందని పేర్కొన్నారు.గతంలో అబ్బూరి వెంకటరమణ న్యాయవాదులకు ఉపయోగపడే పుస్తకాన్ని రచించారని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారుల నుంచి కింది స్థాయి ఉద్యోగుల వరకు ప్రయోజనం చేకూర్చేలా ఆఫీస్ కరస్పాండెన్స్‌పై సమగ్ర పుస్తకాన్ని రచించడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏ వి ఆర్ కె కాంత్, రాధాకృష్ణ, రామ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

కలమంద రాములు దశదినకర్మకు సీపీఐ నేతల హాజరు

- కుటుంబ సభ్యులకు పరామర్శ.. మృతుడికి ఘన నివాళి



విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండల సీపీఐ సమితి సభ్యుడు కలమంద కాసిం తండ్రి కలమంద రాములు అనారోగ్యంతో మృతి చెందడంతో నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం కొండ్రాపుపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు పాల్గొని నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి హాజరై కలమంద రాములు చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాలమురళి, తిరుపతయ్య, గీతాంజలి, మండల కౌన్సిల్ సభ్యుడు ధూప నిరంజన్, బి. చక్రి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కోకాపేటలో "నో బిన్ – నో ట్రేడ్" తనిఖీలు.. రూ.5 వేల జరిమానా

- డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయని దుకాణాలపై మున్సిపల్ అధికారుల చర్యలు



రాజేంద్రనగర్, విశాల భారతి : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నార్సింగి సర్కిల్ పరిధిలోని కోకాపేట వార్డు నంబర్ 125లో పారిశుధ్య నిర్వహణను మెరుగు పరిచే లక్ష్యంతో గురువారం "నో బిన్ - నో ట్రేడ్" కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో దుకాణాల్లో తడి, పొడి చెత్త సేకరణకు అవసరమైన డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయని వ్యాపార సంస్థలను గుర్తించి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా మొత్తం రూ.5,000 జరిమానా వసూలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. నగరంలో పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతిరోజూ ప్రతి వార్డులో ఈ కార్యక్రమం కింద తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వ్యాపారస్తుడు తమ దుకాణాల్లో తడి, పొడి చెత్త కోసం వేర్వేరుగా డస్ట్‌బిన్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించకుండా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయని దుకాణాలపై జరిమానాలు విధించడంతో పాటు అవసరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వ్యాపారస్తులు మున్సిపల్ పారిశుధ్య నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ స్వచ్ఛత కార్యక్రమానికి సహకరించాలని నార్సింగి సర్కిల్ అధికారులు కోరారు. డస్ట్‌బిన్ ఉంటేనే వ్యాపారం.. స్వచ్ఛమైన పరిసరాలే లక్ష్యం అనే నినాదంతో కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రామ అభివృద్ధే ధ్యేయంగా రోడ్డు నిర్మాణానికి శ్రీకారం

- గ్రామ అభివృద్ధి తో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- గ్రామ సర్పంచ్ మారేడు పల్లి నరేందర్ రెడ్డి



విశాలభారతి, ఇబ్రహీంపట్నం: యాచారం మండల పరిధిలోని తక్కలపల్లి గ్రామంలో 7వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులు గురువారం గ్రామ సర్పంచ్ మారేడు పల్లి నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ కంబాలపల్లి సువర్ణ, వార్డు మెంబర్లతో కలిసి ప్రారంభించారు.చాలా కాలంగా వార్డు లో మార్గం దెబ్బతిని, రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుండటంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకొని, వార్డు అభివృద్ధే ధ్యేయంగా గ్రామ పంచాయతీ ప్రత్యేక నిధులతో ఈ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ మారేడుపల్లి నరేందర్ రెడ్డి వార్డు సభ్యులు మాట్లాడుతూ గ్రామ సమగ్ర అభివృద్ధితో పాటు ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు తమ పాలకవర్గం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కంబాలపల్లి సువర్ణ, వార్డు సభ్యులు ఆవుట్ మహేందర్ (2వ వార్డు), మార్కాపురం కృష్ణ (5వ వార్డు), వలపోతు మంజుల (8వ వార్డు), పంబలి శిల్ప (9వ వార్డు), కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కంటేకార్ తులసి కుమార్, తదితరులు పాల్గొన్నారు.


తాటిపర్తిలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలి

- గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి
- గ్రామ సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్ ఎంపీఓ శ్రీలత

విశాల భారతి ఇబ్రహీంపట్నం ; ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలని తాటిపర్తి సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్ అన్నారు. గురువారం తాటిపర్తి గ్రామంలో భూగర్భ జలాల పెంపుదల, పరిశుభ్రత కోసం ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతల నిర్మాణానికి గ్రామ సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్, ఎంపీవో శ్రీలత గ్రామంలో పాల్గొని మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు నిర్మించుకొని, వర్షపు నీటిని భూమిలోకి ఇంకించి, భూగర్భ జలాలను కాపాడుకోవాలని, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమం లో సెక్రటరీ శివ కుమార్, ఉప సర్పంచ్ ముపిడి రమేష్, వార్డ్ మేబెర్స్ దార దశరథ, ఆడాల సుశీల, ఏనుగొండ శ్రీశైలం యాచారం మలేష్ పాల్గొన్నారు.

గూడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కోతుల స్వైర విహారం

- op బ్లాక్ ముందు కోతుల సిట్టింగ్



విశాలభారతి, గూడూరు: గూడూరు మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కోతుల స్వైర విహారం రోగులు చికిత్స కోసం ఆసుపత్రికి వస్తుంటారు వివిధ పరిస్థితుల్లో తమరి ఆరోగ్యం కోసం చిన్న పిల్లలు పెద్దవారు సహా అందరూ తమ ఆరోగ్యం కాపాడుకోవడం కోసం ఆసుపత్రికి రావడం జరుగుతుంది రోగులు తమ విశ్రాంతి కోసం ఆసుపత్రి పరిసర ప్రాంతంలో కూర్చుందాం అంటే కోతులు ఎక్కడ తమ మీద దాడి చేస్తాయని భయంతో రోగులు ఆస్పత్రి బయట కూర్చోవడం లేదు కావున కావున గూడూర్ సర్పంచ్ ఎన్నిసార్లు కోతులను పట్టించిన గూడూరు గ్రామ ప్రజలకు తప్పని తిప్పలుగా ఈ సమస్య పునర్వృతం కావడం బాధాకరమని ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగుల యొక్క బాధ వెళ్ళు ఉంచుకోవడం జరిగింది

రూ.2.75 కోట్లతో శంషాబాద్ మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం



రాజేంద్రనగర్, విశాల భారతి : రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు, తండాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా శంషాబాద్ మండల పరిధిలోని పాలమాకుల, మేకల బండ తండా, పిల్లోనిగూడ, మదనపల్లి పాత తండాలలో హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ నిధులు రూ.2.75 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు.

ఈ నిధులతో ఆయా గ్రామాలు, తండాల్లో భూగర్భ మురుగునీటి కాలువలు, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడంతో పాటు పారిశుధ్యం, రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ గ్రామాలు, తండాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలకు అవసరమైన అన్ని సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, తండావాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దీపావళి వేళ బాణసంచా విక్రయాల్లో అప్రమత్తత తప్పనిసరి!

- భద్రతా ప్రమాణాలు, లైసెన్స్ నిబంధనలు పాటించాలి
- దుకాణాల వద్ద నీరు, ఇసుక, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచాలి
- అనుమతి లేని బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు
- విక్రేతలకు హయత్‌నగర్ ఫైర్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి సూచనలు

విశాల భారతి, ఎల్.బి.నగర్: రాబోయే దీపావళి పండుగను పురస్కరించుకుని బాణసంచా విక్రయదారులు, ప్రజలు అగ్నిప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలని హయత్‌నగర్ ఫైర్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి సూచించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బాణసంచా విక్రయదారులకు భద్రతా ప్రమాణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.పండుగ సమయంలో ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

లైసెన్స్ పొందిన విక్రేతలు ప్రభుత్వ అనుమతి ఉన్న ప్రదేశాల్లోనే బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేయాలని యాదగిరి సూచించారు. ప్రతి దుకాణం వద్ద నీటి బకెట్లు, ఇసుక, అగ్నిమాపక పరికరాలను తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. విద్యుత్ వైరింగ్ సురక్షితంగా ఉండేలా చూసుకోవడంతో పాటు, దుకాణాల వద్ద ధూమపానం నిషేధం బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ అనుమతి లేని బాణసంచాను విక్రయించరాదని స్పష్టం చేశారు. లైసెన్స్ నిబంధనలు, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాణసంచా కొనుగోలు చేసే ప్రజలు కూడా విక్రయ కేంద్రాల వద్ద భద్రతా నియమాలు పాటించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా విక్రయదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని, పోలీస్ మరియు అగ్నిమాపక శాఖ అధికారులకు సహకరించాలని యాదగిరి కోరారు. ప్రజలందరూ సురక్షిత వాతావరణంలో దీపావళి పండుగను జరుపుకోవాలని

ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలి



- ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదు
- డంపింగ్ యార్డ్ సమస్యలపై బీసీ పీపుల్స్ ఫెడరేషన్ పాదయాత్ర
- కాలుష్యంపై సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులకు డిమాండ్
- తరలించే వరకు ప్రజల పక్షాన పోరాటం: బొంగు వెంకటేష్ గౌడ్

విశాల భారతి, ఎల్.బి.నగర్: ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలని డిమాండ్ చేస్తూ బీసీ పీపుల్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం మన్సూరాబాద్ డివిజన్ నుంచి డంపింగ్ యార్డ్ వరకు పాదయాత్ర నిర్వహించారు. డంపింగ్ యార్డ్ వద్దకు చేరుకున్న నాయకులు అక్కడి పరిస్థితులను పరిశీలించి చెత్త నిల్వ, వ్యర్థాల నిర్వహణ, దుర్వాసన, పొగ, కాలుష్య సమస్యలపై ఆరా తీశారు.

ప్రజారోగ్యానికి ముప్పుగా డంపింగ్ యార్డ్

ఈ సందర్భంగా బీసీ పీపుల్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఆటోనగర్ డంపింగ్ యార్డ్ కారణంగా మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త నుంచి వెలువడుతున్న దుర్వాసన, పొగ, గాలి కాలుష్యం, వ్యర్థాల వల్ల నీటి కాలుష్యం వంటి సమస్యలు ప్రజల జీవనాన్ని ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు సహా స్థానికుల ఆరోగ్యంపై పడుతున్న ప్రభావాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించాలని కోరారు. జీహెచ్ఎంసీ అధికారులు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వెంటనే స్పందించి డంపింగ్ యార్డ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలని, గాలి, నీటి నాణ్యతను పరీక్షించి పర్యావరణ నిబంధనలు పాటిస్తున్నారో లేదో పరిశీలించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా డంపింగ్ యార్డ్‌ను పూర్తిస్థాయిలో తరలించే వరకు పోరాటం కొనసాగిస్తామని, అవసరమైతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. ఈ పాదయాత్రలో బీసీ నాయకులు జలమోని రవీందర్ ముదిరాజ్, కొంగరి కృష్ణ, బంజారా జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కే. గాంధీ నాయక్, బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు చిప్పలపల్లి యాదగిరి, తెలుగు యువత రాష్ట్ర నాయకుడు నకిరేకంటి శ్రీకాంత్, చిప్పలపల్లి నరేందర్, చిప్పలపల్లి సురేష్, చేగూరి పరమేష్, జై భారత్ జాతీయ ఉపాధ్యక్షుడు ఖదిజ్ఞాసి వంశీ, రాష్ట్ర కార్యదర్శి ఖదిజ్ఞాసి రాజు, సామాజిక విప్లవ రణభేరి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి సైదయ్య, రాష్ట్రకార్యదర్శి ఖదిజ్ఞాసి గణేష్ గల్లా, జై భారత్ ఎస్సీ పోరాట వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఖదిజ్ఞాసి మధు మాదిగ, పాండు, గురువయ్య, శ్రీనివాస్ పిట్ట తదితరులు పాల్గొన్నారు.

మండలంలో వ్యవసాయ అధికారుల క్షేత్రస్థాయి పంట పొలాల పరిశీలన

- ఎలినినో ప్రభావం వల్ల నష్టపోయిన పంటల వివరాల సేకరణ నమోదు.
- మండల వ్యవసాయ అధికారి రవినాథ్



చివరి తేదీ: 8.11.2026

విశాల భారతి ఇబ్రహీంపట్నం ; ఎల్ నినో ప్రభావం వల్ల మండలంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల పరిస్థితిని సమీక్షించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో క్షేత్ర స్థాయి పోలాల పరిశీలన. ఈ సందర్భంగా అధికారులు రైతుల పొలాల్లోని పంటల స్థితిగతులను, నీటి ఎద్దడి వల్ల కలిగిన నష్టాన్ని, తెగుళ్ల తాకిడిని క్షుణ్ణంగా పరిశీలించి రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు లభ్యతగా ఉన్న నీటిని బిందు, తుంపర సేద్య పద్ధతుల ద్వారా సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. నీటి ఎద్దడి సమయంలో పంట తట్టుకునే శక్తిని పెంపొందించేందుకు పొటాష్ ఎరువులు సూక్ష్మ పోషకాల స్ప్రేలను తగిన మోతాదులో వాడాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసి, నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరంగా తగిన న్యాయం జరిగేలా ఉన్నతాధికారులకు నివేదిక పంపడం జరుగుతుందని అన్నారు . ఈ విషయాన్ని పంట నష్టపోయిన రైతులు మీ వ్యవసాయ విస్తరణ అధికారికి తెలుపగలరని సూచించారు.ఎవరిదైనా పంట నష్టం 33 శాతం కంటే ఎక్కువగా ఉంటే మన ఏ ఈ ఓ కు తెలిపి వారు పంట నష్టం యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు.

కావలిసిన పత్రాలు:

పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాపాస్ బుక్, పంట నష్టమైనా ఫోటో

ఈ వివరాలు మన ఏఈఓ లకు ఇవ్వాలని అన్నారు.

యాచారం మండల ఏఈఓ ల వివరాలు,

1. ఎస్. సంతోష్ కుమార్, 6305920174, యాచారం క్లస్టర్ (యాచారం, మొగుళ్లపంపు, నందివనపర్థ్, మల్కీజ్గూడ, అయ్యవరిగూడ, తక్కలపల్లీ, తక్కల్లపల్లి తండ),

2.ఏ . గురు ప్రసాద్, 6305920176, గున్గల్ క్లస్టర్(గుంగల్, గడ్డమల్లయ్యగూడ, చౌదరిపల్లి, మొందిగౌరెల్లి , తులేకుర్దు, ధర్మాన గూడ),

3.ఎం . రమేష్,6305920175, మేడిపల్లి క్లస్టర్ (మేడిపల్లి, నక్కర్త, కొత్తపల్లి, ననక్కగర్, తటిపర్తి, కుర్మిద్ద),

4.పి . నవ్య,6305920177, మాల్ క్లస్టర్(మాల్, నల్లవెల్లి, చింతపట్ల, మంతంగౌడ్, మంతంగౌరెల్లి తమ్మాలోనిగూడ, సుల్తాన్ పూర్)

ఎలక్ట్రిక్ వాహనాలతోనే పర్యావరణ రక్షణ

- ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి
- తిమ్మాపూర్ లో ఈడెన్ &శుభమ్ ఈవీ ఎలక్ట్రిక్ వాహనాల షోరూం ప్రారంభోత్సవం



విశాల భారతి, షాద్ నగర్: పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఎంతో దోహదపడుతుందని, భవిష్యత్తు అంతా ఈవీలదేనని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు.కొత్తూరు మండలం లోని తిమ్మాపూర్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన అధునాతన ఈడెన్&శుభమ్ ఈవీ ఎలక్ట్రిక్ వాహనాల షోరూం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. పెరుగుతున్న ఇంధన ధరల భారం నుంచి సామాన్యుడికి ఉపశమనం కలిగించడంతో పాటు, కాలుష్య రహిత సమాజ స్థాపనకు ఈవీ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.సరికొత్త సాంకేతికతతో,తక్కువ ఖర్చుతో ఎక్కువ మైలేజ్ ఇచ్చే మోడళ్లను స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా షోరూం నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.ఈ కార్యక్రమంలో షోరూం యాజమాన్యం,బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పోరాట యోధుడు నల్లా నర్సింహులుకు ఘన నివాళి

- త్యాగాలు, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలి



విశాల భారతి, ఎల్.బి.నగర్ : భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు నల్లా నర్సింహులు 34వ వర్ధంతి కార్యక్రమాన్ని మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగ్‌రావు నల్లా నర్సింహులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కటకం నర్సింగ్‌రావు మాట్లాడుతూ..నల్లా నర్సింహులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించి, భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడారని కొనియాడారు. ఆయన త్యాగాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. మహనీయుల జీవిత చరిత్రలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెద్దవూరే బ్రహ్మయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల దేవేందర్‌జీ, అమృత మార్కండేయులు, పెద్దవూరే బ్రహ్మయ్య, కోంపోజ్ నరహరి చారి, మారోజు రాజు చారి, గాది కృష్ణయ్య, సామ పృథ్వీరాజ్ ముదిరాజ్, కటకం శ్రీకాంత్, దుర్గం శ్రీనివాస్, దోర్నాల కొండలరావు, కడవేరు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలి

- నిరుద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆస్మా డిమాండ్



ముషీరాబాద్,విశాల భారతి: రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఉద్యోగ నోటిఫికేషన్ల ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద నిరుద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువారం జరిగిన సమ్మేళనంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ నాయకురాలు ఆస్మా మాట్లాడుతూ రెండు లక్షల ఉద్యోగాల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మెగా డీఎస్సీ, డిగ్రీ లెక్చరర్, గురుకుల, అసిస్టెంట్ ప్రొఫెసర్ నోటిఫికేషన్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. టెట్ దరఖాస్తులకు రూ.వెయ్యి ఫీజు వసూలు చేయడం మేనిఫెస్టో హామీలకు విరుద్ధమన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి, జాబ్ క్యాలెండర్ అమలు చేసిన తర్వాతే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు.రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయనందున 30 లక్షల మంది నిరుద్యోగుల సత్తా ఎమ్మెల్సీ ఎన్నికల్లో చూపిస్తామని హెచ్చరించారు. ఈ సమ్మేళనంలో నిరుద్యోగులు మూర్తి, ఉదయ్ కుమార్, వెంకట్, రాకేష్, హరీష్, సాయి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి భవన నిర్మాణానికి రూ.5 కోట్లు, కోకాపేటలో 2.5 ఎకరాల భూమి కేటాయింపు

- పద్మశాలి సంఘం నాయకుల హర్షం
- సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు



సికింద్రాబాద్, విశాల భారతి: పద్మశాలి కులస్తుల చిరకాల స్వప్నమైన భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని ఆ సంఘం నాయకులు తెలిపారు . కోకాపేటలో పద్మశాలి భవన నిర్మాణం కోసం 2.5 ఎకరాల భూమితో పాటు రూ.5 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది అన్నారు. ఈ సందర్భంగా గురువారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసం వద్ద పద్మశాలి సంఘం నాయకులు, బీసీ రాజ్యాధికార సమితి ప్రతినిధులు మంత్రిని కలిసి ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు.పద్మశాలి కులస్తుల అభ్యున్నతికి, సామాజిక ఐక్యతకు ఈ భవనం ఎంతగానో దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పద్మశాలి నేతలతో పాటు బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపకులు దాసు సురేష్, సీఈఓ పోచాల సరస్వతి, మంద వెంకటస్వామి, మంద ఈశ్వర్, దంత ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి

విశ్వ బ్రాహ్మణ ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం ఐదు కోట్లు

- **సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, వివిహెచ్ కు కృతజ్ఞతలు తెలిపిన కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి**



ముషీరాబాద్,విశాల భారతి: ఉప్పల్ భగయత్ లో విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ భవన నిర్మాణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఐదు కోట్ల రూపాయల ప్రొసీడింగ్ ఇవ్వడం హర్షదాయకమని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అన్నారు. ఆత్మగౌరవ భవన నిర్మాణం వేగవంతం చేయడానికి కృషిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, వివిహెచ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గురువారం మినిస్టర్ క్వార్టర్స్ లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ విశ్వబ్రాహ్మణ ప్రతినిధులకు నిర్మాణ ప్రొసీడింగ్ జీవోను అందజేశారు. అనంతరం గణేష్ చారి మాట్లాడుతూ రాష్ట్రంలో 38 బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొని భవన నిర్మాణాలకు సంబంధించిన రూ 88.50 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవోలు జారీ చేయడం సంతోషదాయకమన్నారు. కేటాయించిన నిధులతో నిర్ణీత కాల పరిమితి లో భవన నిర్మాణాలు పూర్తి అయితే విశ్వబ్రాహ్మణ విద్యార్థులతో పాటు బీసీ విద్యార్థులు నైపుణ్యాభివృద్ధి వసతి సౌకర్యాలు సామాజిక కార్యక్రమాలు కుల సంఘాల అభ్యున్నతికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం వెనకడుగు వేయకుండా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ చూపి నిర్మాణానికి సంబంధించిన జీవోలు ప్రొసిడింగ్ అందజేసినందుకు బీసీ సంఘాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లాల్కోట వెంకటాచారి, బొడ్డుపల్లి సుందర, వేములవాడ మదన్ మోహన్, వడ్ల హనుమల్లు, ఎర్రోజు వేణు, బలవంత చారి, పులివెందుల యాదగిరి, పులి శ్రీనివాస్ చారి, వల్లబోజు నరసింహాచారి, అనంత బ్రహ్మచారి తో పాటు వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఫరూక్‌నగర్ మండలంలో వ్యవసాయ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన



విశాల భారతి, షాద్ నగర్: ఎల్ నినో ప్రభావం వల్ల మండలంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల పరిస్థితిని సమీక్షించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు గురువారం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఫరూక్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల, ఉప్పరిగడ్డ, వెల్జర్ల గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్ నేతృత్వంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రాంబాబు, గోవర్ధన్, ప్రణీత పొలాలను నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు రైతుల పొలాల్లోని పంటల స్థితిగతులను, నీటి ఎద్దడి వల్ల కలిగిన నష్టాన్ని, తెగుళ్ల తాకిడిని క్షుణ్ణంగా పరిశీలించి రైతుల నుంచి వివరాలు సేకరించారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు లభ్యతగా ఉన్న నీటిని బిందు, తుంపర సేద్య పద్ధతుల ద్వారా సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. నీటి ఎద్దడి సమయంలో పంట తట్టుకునే శక్తిని పెంపొందించేందుకు పొటాష్ ఎరువులు మరియు సూక్ష్మ పోషకాల స్ప్రేలను తగిన మోతాదులో వాడాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసి, నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరంగా తగిన న్యాయం జరిగేలా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు.

జన సంకల్ప యాత్ర విజయంపై అభినందన సభ

- **పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ ఈటల రాజేందర్**
- **కార్యక్రమంలో పాల్గొన్న తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి**



విశాలభారతి, ఎల్.బి.నగర్ : జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు కోసం చేపట్టిన 'జవహర్‌నగర్ జన సంకల్ప యాత్ర' పాదయాత్ర విజయవంతమైన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపేందుకు దేవరయాంజాల్‌లోని ఓన్వా కన్వెన్షన్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ హాజరై నాయకులు, కార్యకర్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొన్నారు. పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు శంకరయ్య గౌడ్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

365 జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం. ఆటోను ఢీకొన్న బైక్!

- **దస్రు తండా క్రాస్ వద్ద ఘటన.. మహిళకు తీవ్ర గాయాలు..**
- **స్పృహ కోల్పోయిన మహిళ.. యువకుడికి కాలుకు గాయం..**





గూడూర్ విశాల భారతి ; గూడూర్ -నర్సంపేట 365 జాతీయ రహదారిపై దస్రు తండా క్రాస్ వద్ద ఆటో, బైక్ ఢీకొని రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మహిళకు బలమైన గాయాలు కావడంతో స్పృహ కోల్పోయి రోడ్డుపై పడిపోయింది. మరో యువకుడు కాలుకు గాయమై మహిళ పక్కనే పడిపోయినట్లు సమాచారం. అకస్మాత్తుగా చోటుచేసుకున్న ఈ ప్రమాదంతో స్థానికంగా కలకలం రేగింది. జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులు, స్థానికులు ప్రమాద ఘటనపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్షతగాత్రుల పరిస్థితి, వారిని ఆసుపత్రికి తరలించిన వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదానికి గల కారణాలపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


చౌటుప్పల్ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే ఊరుకునేది లేదు

- **బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు**



చౌటుప్పల్, విశాలభారతి: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని 13వ వార్డు, జై భూమి వెంచర్‌లో నివాస ప్రాంతాల మధ్య, పాఠశాలలకు సమీపంలో ఎయిర్‌టెల్ టవర్ పేరుతో రాత్రికి రాత్రే అక్రమంగా పిల్లర్లు వేయడాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి, నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న ఈ నిర్మాణంపై అధికార యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనావాసాలు, చిన్నపిల్లలు చదువుకునే పాఠశాలలు ఉన్న ప్రాంతంలో ఎవరికీ తెలియకుండా, పరదాలు కప్పుకుని దొంగచాటుగా టవర్ నిర్మాణాలు చేపట్టడం అప్రజాస్వామికమని అన్నారు. ఇక్కడి ప్రజల ఆరోగ్య భద్రతను గాలికొదిలేసి కొద్దిమంది స్వార్థం కోసం ఇలా చేయడం క్షమించరాని నేరమని విమర్శించారు. ఈ అక్రమ నిర్మాణాన్ని ప్రశ్నించిన స్థానిక ప్రజలను, మున్సిపాలిటీకి ఏంటా సంబంధం అని, కోర్టు ఆర్డర్లు ఉన్నాయని కొందరు బెదిరింపులకు దిగడం దారుణమన్నారు. ప్రజాప్రతినిధులుగా, బాధ్యత గల స్థానికులుగా ప్రజల పక్షాన నిలబడితే అణచివేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. హెచ్‌ఎమ్‌డీఏ నిబంధనల ప్రకారం గజం రూ. 25,000 నుండి రూ. 30,000 వరకు కష్టపడి సంపాదించుకున్న డబ్బులతో ఇక్కడ ఇళ్లు కట్టుకుని ప్రజలు ప్రశాంతంగా బతుకుతున్నారని, ఈ టవర్ల వల్ల వెలువడే రేడియేషన్‌తో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లితే ఊరుకోమని స్పష్టం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి, ఆ ప్రాంతంలో వేసిన పిల్లర్లను, నిర్మాణ సామగ్రిని పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానిక ప్రజలను కలుపుకుని తీవ్రస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, దీనివల్ల జరిగే పరిణామాలకు ప్రభుత్వమే, అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

ట్రాక్టర్ ఓనర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చేవగోని రమేష్ గౌడ్



చౌటుప్పల్, విశాలభారతి: చౌటుప్పల్ శ్రీ మచ్చగిరి లక్ష్మీనరసింహస్వామి ట్రాక్టర్ ఓనర్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయ ఆవరణలో ట్రాక్టర్ ఓనర్ అసోసియేషన్ సభ్యుల సమావేశం నిర్వహించారు. కమిటీ గౌరవ సలహాదారులు పూసుకురి యాదగిరి, మెండే బుచ్చయ్య, చేవగోని వెంకటేష్ గౌడ్, గౌరవ అధ్యక్షుడు ఉడుగు ఇస్తారి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా చేవగోని రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సుర్కంటి నర్సిరెడ్డి ని ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులు దొనకొండ గోవర్ధన్, చిందం అశోక్ ,కోశాధికారులు ఆరుట్ల లింగస్వామి, ముప్పిడి లింగస్వామి గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శులు సరిపల్లి అశోక్, పూసుకురి శీను, బొంగు శివగౌడ్ గౌరవ సభ్యులు చింతల మధుసూదన్ రెడ్డి, బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి, గుణగోని కృష్ణ, పబ్బతి లక్ష్మయ్య, సుర్కంటి యాదిరెడ్డి, యానాల యాదిరెడ్డి, ఉదరి యాదయ్య, సుర్కంటి శంకర్ రెడ్డి, కొమురెల్లి ఉపేందర్ రెడ్డి, మరుపాక నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు చేవగోని రమేష్ గౌడ్ మాట్లాడుతూ, అసోసియేషన్ అభివృద్ధికి, ట్రాక్టర్ యజమానుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం








- **మాపుల్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమం..**
- **బాలల భద్రత, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన**

విశాల భారతి, ఎల్ బి నగర్ : హయత్‌నగర్‌లోని మాపుల్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల కోసం లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య, వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రమేష్, హయత్‌నగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ చిరంజీవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ పలు కీలక అంశాలను వివరించారు. బాలల భద్రత, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, రోజువారీ జీవితంలో చట్టాల ప్రాధాన్యత, మంచి పౌరులుగా బాధ్యతలు, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. రహదారి భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని, చిన్నతనం నుంచే క్రమశిక్షణ, సామాజిక బాధ్యత అలవర్చుకోవాలని తెలిపారు. హయత్‌నగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని, బాలల భద్రతకు సంబంధించిన చట్టాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండే విధానాలను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని సూచించారు. మంచి పౌరులుగా ఎదుగుతూ సమాజంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రమేష్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రహదారిపై ప్రయాణించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ సంకేతాల ప్రాధాన్యతను వివరించారు. హయత్‌నగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ చిరంజీవి మాట్లాడుతూ.. విద్యార్థులు చట్టాలను గౌరవిస్తూ, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియాను మంచికి ఉపయోగించుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల సహాయం తీసుకోవాలని తెలిపారు. పాఠశాల చైర్మన్ సుబ్బా రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక, చట్టపరమైన అవగాహన కల్పించడం పాఠశాల బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. దైరెక్టర్లు స్వాతి, శ్వేత మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు విద్యతో పాటు చట్టాలపై అవగాహన కూడా ఎంతో అవసరమని, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్ స్మిత, ఏ ఓ ఐషా తో పాటు ఉపాధ్యాయులు,విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది కొరతపై బీజేపీ ఆగ్రహం

- **30 మంది సిబ్బంది అవసరమున్న చోట 13 మంది కూడా లేరు**
- **తక్షణమే వైద్య సదుపాయాలు కల్పించాలి**
- **బిజెపి నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి**




ఆసుపత్రి సూపరిడెంట్ తో మాట్లాడుతున్న పాలమూరు విష్ణు వర్ధన్ రెడ్డి..

విశాలభారతి,షాద్ నగర్: కొందుర్గు మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన దళిత యువతి ప్రసవ సమయంలో మృతి చెందిన ఘటన నేపథ్యంలో షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని బీజేపీ నాయకులు సందర్శించారు.బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు ఆసుపత్రిని పరిశీలించి, సూపరింటెండెంట్‌తో వైద్య సేవలు,సిబ్బంది కొరతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రిలో కనీసం 30 మంది వైద్య సిబ్బంది అవసరం ఉండగా, ప్రస్తుతం 13 మంది కూడా అందుబాటులో లేరని అధికారులు వెల్లడించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ఈ పరిస్థితి ప్రభుత్వ వైద్య ఆరోగ్య వ్యవస్థలో నెలకొన్న దుస్థితికి అద్దం పడుతోందని విమర్శించారు. కేవలం వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, భవనాల విస్తరణతో పేదలకు మెరుగైన వైద్యం అందదని, అందుకు అనుగుణంగా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, అత్యాధునిక వైద్య పరికరాలు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాలను తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత కారణంగా పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రకటనలకు పరిమితం కాకుండా ప్రభుత్వం ఆచరణలో దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచించారు. చెరుకుపల్లి యువతి మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. యువతి భర్తపై అక్రమంగా కేసు బనాయించారన్న ఆరోపణలపైనా విచారణ జరపాలని కోరారు. పేద కుటుంబాలపై నిందలు మోపి అసలు సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేయవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వైద్య వ్యవస్థపై బీజేపీ మౌనంగా ఉండబోదని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన వైద్య సిబ్బంది, పరికరాలు, మౌలిక సదుపాయాలు కల్పించే వరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు..

బుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యపై వినతిపత్రం!

- **నిరుపేదలకు న్యాయం చేయండి**



స్వామి నాయక్ వినోద్ నాయక్, కాతోజు వినోద్, రవీందర్ నాయక్, గోపి తదితరులు పాల్గొన్నారు

అడవిదేవులపల్లి, విశాలభారతి : ఉల్సాయిపాలెం గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యపై వడ్త్యా శివ నాయక్ ఆర్డీఓని కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. అర్హులైన నిరుపేద కుటుంబాలకు న్యాయం జరగాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించి నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. పేదల సంక్షేమమే లక్ష్యం...అర్హులకు న్యాయం జరిగే వరకు మా ప్రయత్నం కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో పానుగోతు


పట్టభద్రుల ఓటరు నమోదు



సికింద్రాబాద్, విశాల భారతి : సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో అర్హులైన పట్టభద్రుల పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సికింద్రాబాద్ ఇంచార్జ్ సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. మెట్టుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోశ్రీ ర్యాల రాజేందర్ యాదవ్ ఆధ్వర్యంలో పట్ట భద్రుల ఓటర్ల నమోదు సహాయతా శిబిరాన్ని వద్ద గురువారం పట్ట భద్రుల ఓటర్ల సహాయం శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ..... 2023 సంవత్సరం అక్టోబరు నాటికి డిగ్రీ లేదా డిప్లొమా పూర్తి చేసిన వారిని ఓటర్లు గా నమోదు చేయించాలని సూచించారు. ఈ ప్రక్రియలోసికింద్రాబాద్ నియవజవర్గ మెట్టుగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రతివ్ రాజ్, టెంపుల్ శ్రీను శ్రీనివాస్ గద్దం మహేందర్ మహిళా నాయకురాలు, సుజత, నిర్మల, సంతోషి, కస్తూరి నాయకులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారి సన్నిధిలో బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ దంపతులు

- **కూతురు రాఘు వితార పుట్టినరోజు సందర్భంగా దర్శనం**



దేవరుప్పుల విశాల భారతి ; గురువారం తమ కూతురి జన్మదినం సందర్భంగా వి ఐ పి బ్రేక్ ప్రత్యేక దర్శన సమయంలో తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని ప్రముఖ వ్యాపారావేత్త, జనగామ జిల్లా బిఆర్ఎస్ నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ రమాదేవి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకోవడం జరిగింది. దర్శనం అనంతరం తి తి దే అధికారులు, అర్చకులు, వారికి వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు, అనంతరం స్వామి వారి ఆలయం లో 5 రూపాయల నాణెలతో తులాభారం వేసి మొక్కులు చెల్లింపు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఆయన దర్శనం కోసం వచ్చిన మాకు స్వామి వారి సేవ చేసుకోవడం, స్వామి వారి మొదటి గడప నేత్ర దర్శనం, చాలా అనందంగా ఉంది అని తెలిపారు.

పెద్దఅంబర్‌పేటలో యథేచ్ఛగా రోడ్డు ఆక్రమణలు!


- **నిబంధనలకు తూట్లు.. సెట్బ్యాక్‌లు లేకుండానే నిర్మాణాలు**
- **పట్టించుకోని మున్సిపల్ అధికారులు.. తీవ్ర ఇబ్బందుల్లో కాలనీవాసులు**





విశాలభారతి: పెద్దఅంబర్‌పేట, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (MMC) పరిధిలోని ఎల్బీనగర్ జోన్, నాగోల్ సర్కిల్ 11కు చెందిన పెద్దఅంబర్‌పేట వార్డులో అక్రమ నిర్మాణాలు, రోడ్డు ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వినాయక నగర్‌లోని కల్లెం బాల్‌రెడ్డి ఫంక్షన్ హాల్ వెనుక భాగంలో ఉన్న లేఅవుట్‌లో కొందరు బిల్డర్లు, భవన యజమానులు నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానిక ప్లాట్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినాయక నగర్‌లోని సర్వే నంబర్లు 599, 604 పరిధిలో కొందరు భవన యజమానులు TGbPASS, BuildNow ద్వారా భవన నిర్మాణ అనుమతులు పొందినప్పటికీ, అనుమతి పత్రాల్లో పేర్కొన్న నిబంధనలను పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాత లేఅవుట్‌లో 20, 25 అడుగుల వెడల్పు మాత్రమే ఉన్న రహదారులను కనీసం 30 అడుగులకు విస్తరించేందుకు అవసరమైన స్థలాన్ని మున్సిపాలిటీకి ఉచితంగా సరెండర్ చేస్తున్నట్లు స్వీయ ధృవీకరణ ఇచ్చినట్లు చెబుతున్నారు. అయితే, తీరా నిర్మాణాల సమయంలో అదే సరెండర్ చేసిన రోడ్డు స్థలంలో బేస్‌మెంట్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రహదారుల వెడల్పు తగ్గిపోవడమే కాకుండా, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని అదే విధం గా రానునా రోజుల్లో కాలనీ లో వాటర్ లైన్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి కూడా ఈ రోడ్డు పైకి వచ్చిన నిర్మాణాలు. అడ్డుగా మారతాయని నివాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు పైకి వచ్చి కట్టిన నిర్మాణాలు తొలగించాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. కాలనీ వాసులు ఎన్ని సార్లు పెద్దఅంబర్ పెట్ మున్సిపల్ అధికారులకు పిర్యాదు చేసిన పాటించుకోవడం లేదని తూతూ మంత్రంగా నోటీసులు ఇచ్చి బిల్డర్స్ కి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోకపోవడం వెనుక కారణాలేమిటని ప్రశ్నిస్తున్నారు. LRS ద్వారా తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్న యజమానులకు ఒక నిబంధన, ఇతరులకు మరో నిబంధనా? అంటూ ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆక్రమణలను తొలగించి లేఅవుట్ రహదారులను పునరుద్ధరించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఆన్‌లైన్ సేవల నిర్వహణపై అవగాహన



గూడూరు, విశాలభారతి: గూడూరు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ (బాయ్స్) పాఠశాల డిజిటల్ క్లాస్ రూమ్‌లో గూడూరు, కొత్తగూడెం, మరియు గంగారం మండలాలకు చెందిన డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్లకు (DDOs) IFMIS మరియు eHRMS పోర్టల్ ద్వారా సర్వీస్ బుక్స్, పేరోల్, పెన్షన్లు మరియు ఆన్‌లైన్ సేవల నిర్వహణపై ఒక రోజు అవగాహన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి గూడూరు (ఎస్.టి.ఓ) మహమ్మద్ రఫీ హాజరై,(ఐ ఎఫ్ యం ఐ ఎస్)(IFMIS) పోర్టల్ ద్వారా బిల్లుల సమర్పణ, ఇసర్వీస్ బుక్ (eSR) అప్‌డేషన్, సెలవుల నిర్వహణ తదితర అంశాలపై డిడిఓలకు సమగ్ర శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల పరిధిలోని డిడిఓలు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణకు జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు మాటేటి శ్రీధర్ సాంకేతిక సహాయ సహకారాలు అందించారు.

గూడూరు రేంజ్ పరిధిలో ఇద్దరు ఫారెస్ట్ ఆఫీసర్ సస్పెండ్

- అధికారికంగా ప్రకటించిన గూడూరు ఎఫ్ఆర్ఓ



విశాలభారతి గూడూరు: గూడూరు రేంజ్ పరిధిలో ని గల బ్రాహ్మణపల్లి దామరవంచ గ్రామాల పరిధిలో గల (రెవెన్యూ భూమి) పట్టా భూమిలో గల. మామిడి చెట్లను కాయలు కాయడం లేదని పక్క కొమ్మలను నరికి ప్రూనింగ్ చేసుకుని అట్టి కొమ్మల కలపను ప్రభుత్వ అనుమతి లేకుండా రవాణా చేసిన విషయంలో సంబంధిత రవాణా కాకుండా పాపలేదని (ఏజెన్సీ ఏరియా) కారణంతో గూడూరు డిఆర్ఓ ఎం పిచ్చేశ్వర రావు ను మాచర్ల ఎఫ్ఎస్ఓ బి శీను ను సంబంధిత అధికారి విధుల నుండి సస్పెండ్ చేయడం జరిగింది

నల్ల నరసింహులు స్థూపానికి పూలమాల వేసిన ఏల సుందర్



దేవరుప్పుల విశాలభారతి: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, విప్లవ పోరాటాల స్ఫూర్తిప్రదాత, ప్రజా హక్కుల కోసం జీవితాంతం పోరాడిన నల్ల నరసింహులు 33వ వర్ధంతిని పురస్కరించుకొని దేవరుప్పుల మండలంలోని ఆయన స్వగ్రామమైన కడవెండిలో ఏర్పాటు చేసిన స్మారక స్థూపానికి సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకుడు ఏల సుందర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పాల్గొని ఆయన పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ఏల సుందర్ మాట్లాడుతూ నల్ల నరసింహులు జీవితం అన్యాయంపై అలుపెరుగని పోరాటానికి, అణగారిన ప్రజల హక్కుల సాధనకు నిలువెత్తు నిదర్శనమని,ప్రజల విముక్తి, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని,ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రజల పక్షాన నిలబడి పోరాడిన ఆయన ధైర్యసాహసాలు, త్యాగనిరతి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని,నల్ల నరసింహులు ఆశయాలను కేవలం వర్ధంతి కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని,సమాజంలో అసమానతలు తొలగి, పేదలు, బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కడవెండి గ్రామ సర్పంచ్ భాషిపాక రాములు, ఉప సర్పంచ్ నక్క రేణుక కొమరయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు తాటిపల్లి మహేష్, సుడిగెల హనుమంతు, పడమటింటి కొమరయ్య, కాశబోయిన యాకన్న, కత్తుల సుధాకర్, భాషిపాక సతీష్, నిలసర్ప ప్రభాకర్, బిట్ల రామసోక్కం, గుమ్మడవెల్లి సోమన్న, నల్ల వీరస్వామి, యాదగిరి, ఉపేందర్, రామచంద్రు, చింతకింది మహేష్, బెల్లి సోమయ్య, యాదగిరి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మామునూరు విమానాశ్రయాన్ని సందర్శించిన హుస్సేన్ నాయక్



విశాలభారతి, గూడూరు: మామునూరు విమానాశ్రయం, వరంగల్ జిల్లా జాతీయ షెడ్యూల్డ్ తెగల. కమిషన్ (ఎన్ సి ఎస్ టి), భారత ప్రభుత్వ గౌరవ సభ్యులు శ్రీ జాటోతు హుస్సేన్ నాయక్ వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (DFO) మరియు ఇతర జిల్లా స్థాయి అధికారులతో కలిసి మామునూరు విమానాశ్రయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలు, గిరిజనుల భూములు, భూములకు సంబంధించిన హక్కులు మరియు ప్రస్తుత పరిస్థితులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల భూములకు సంబంధించిన హక్కులు, ప్రయోజనాలకు ఎలాంటి విఘాతం కలగకుండా, వారి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

ప్రభాత్ నగర్ పార్కును కాపాడుకుంటాం

- వాకర్లకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటాం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి
- టీమ్స్ ఆసుపత్రి గేటు ఏర్పాటుపై వాకర్ల ఆందోళన
- పార్కు స్థలాన్ని అందుబాటులో ఉంచేలా అధికారులకు సూచన



విశాల భారతి, ఎల్.బి.నగర్ : ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం 5:30 గంటలకు చైతన్యపురి డివిజన్‌లోని ప్రభాత్ నగర్ పార్కును ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సందర్శించారు. పార్కులో వాకింగ్ చేస్తున్న స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాకర్లు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పందలాది మంది స్థానికులు ఈ పార్కులో వాకింగ్ చేస్తున్నారని, పక్కనే నిర్మాణంలో ఉన్న టీమ్స్ ఆసుపత్రి యాజమాన్యం పార్కు వద్ద గేటు ఏర్పాటు చేయనున్నట్లు తెలియడంతో ఆందోళన చెందుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గేటు ఏర్పాటు చేస్తే వాకింగ్‌కు సరిపడా స్థలం లేకుండా పోతుందని, పార్కును రెండు భాగాలుగా విభజించడం సరికాదని పేర్కొన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ గతంలో టీమ్స్ ఆసుపత్రి శంకుస్థాపన సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి పోలీస్ స్టేషన్, చిల్డ్రన్స్ పార్క్, వాటర్ ట్యాంక్, సబ్‌స్టేషన్ తదితర అవసరాల కోసం స్థలం కేటాయించాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన జీవో జారీ అయినప్పటికీ ప్రభుత్వం మారిన తర్వాత దానిని పక్కన పెట్టారని పేర్కొన్నారు. ఏదేమైనా ప్రభాత్ నగర్ పార్కు స్థలాన్ని వాకర్లకు అందుబాటులో ఉంచేలా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, గేటు ఏర్పాటు వల్ల వాకర్లకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీపై వాకర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, తోట మహేష్‌యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, త్రివేది, పవన్, జయశ్రీ, గట్టు శీను, రమణారెడ్డి, కాలనీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో రబీలో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

విశాలభారతి,మెదక్ ప్రతినిధి : ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు, భూగర్భ జలాల తగ్గుదలను దృష్టిలో ఉంచుకుని రబీ సీజన్‌లో వరికి బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ప్రకటనలో రైతులకు పలు సూచనలు చేశారు. రబీ సీజన్‌లో పంటల సాగుకు ముందే అందుబాటులో ఉన్న నీటి వనరులు, వ్యవసాయ బోర్లు, భూగర్భ జలాల లభ్యతను అంచనా వేసుకోవాలని తెలిపారు. విద్యుత్ సరఫరా అందుబాటులో ఉన్నప్పటికీ భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బోర్లలో ఆశించిన స్థాయిలో నీరు లభించడం లేదని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నీటి లభ్యతను అంచనా వేయకుండా వరి సాగు చేపడితే మధ్యలో నీటి కొరత ఏర్పడి పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు పెట్టుబడి నష్టాలను నివారించుకునేందుకు తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, స్వల్పకాలిక పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు.

భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

- భూభారతి, జీవో 118, 59, యూఎల్‌సీ, 90-డి, 92 దరఖాస్తులపై ప్రత్యేక కార్యాచరణ
- నిబంధనల ఉల్లంఘనకు కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



విశాలభారతి ఇబ్రహీంపట్నం: జిల్లాలో భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు కిరణ్మయి, చంద్రా రెడ్డితో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూభారతి, జీవో 118, 59, యూఎల్‌సీ, 90డి, 92 దరఖాస్తుల పరిష్కార పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి పోర్టల్ లో పెండింగ్ లో ఉన్న సుమారు 22 వేల దరఖాస్తులను నవంబర్ 15లోగా పరిష్కరించాలని, జీవో 118 దరఖాస్తులను వారం రోజుల్లో, జీవో 59, 92 దరఖాస్తులను 15 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. యూఎల్‌సీకి సంబంధించి జీవో 455, 456, 740 కింద ఉన్న మాన్యువల్ దరఖాస్తులను రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా పరిష్కరించాలని సూచించారు.భూ రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, గ్రామసభలకు వారం రోజుల ముందుగానే నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు. అటవీ, రోడ్లు భవనాలు, ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన భూముల వివరాలను సేకరించి, ఆయా శాఖల అధికారుల సమక్షంలో సరిహద్దులను నిర్ధారించాలని, వారి అభిప్రాయాలు, సంతకాలను రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామ సభల నిర్వహణలో నిర్దేశిత ఎస్ఓపీని తప్పనిసరిగా పాటించాలని, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి హాజరు కావాలని, సమావేశ మినిట్స్‌ను అధికారిక రిజిస్టర్లలో నమోదు చేసి హాజరైన వారి సంతకాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రీసర్వేకు సంబంధించిన 13 ఫార్మాట్లను సక్రమంగా నిర్వహిస్తూ, సర్వే బౌండరీస్ యాక్ట్-1923, తెలంగాణ భూభారతి చట్టం-2024 నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ, రిజర్వ్, ఇతర శాఖల భూముల విషయంలో క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని, నోటీసుల జారీ, సరిహద్దుల నిర్ధారణ, గ్రామసభ మినిట్స్ సహా అన్ని రికార్డులను భద్రపరచాలని కలెక్టర్ ఆదేశించారు. తప్పుడు నివేదికలు సమర్పించడం, రికార్డుల తారుమారు, నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే సంబంధిత అధికారులపై కఠిన శాఖాపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు డాక్టర్ కిరణ్మయి, చంద్రారెడ్డి, ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్స్ రాంరెడ్డి, డిఆర్ఓ శారదా దేవి, ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లు, యూఎల్‌సీ విభాగం అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, గ్రామపాలన అధికారులు (GPO), సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా కిసాన్ మహాసభలను జయప్రదం చేయాలి

- బూరుగు కృష్ణారెడ్డి పిలుపు



చౌటుప్పల్, విశాలభారతి: ఆల్ ఇండియా కిసాన్ సభ ఆధ్వర్యంలో నవంబర్ 15,16,17,18 తేదీలలో నల్లగొండలో జరిగే జాతీయ మహాసభలను, అదేవిధంగా నవంబర్ 15వ తేదీన జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో బుధవారం కందాల రంగారెడ్డి స్మారక భవనం నుండి నల్లగొండ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా ఉన్న రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ప్రతి ఇంటి నుంచి ఒకరు, ప్రతి ఊరి నుంచి ఒక వాహనం చొప్పున ప్రజలు కదిలి వచ్చి ఈ బహిరంగ సభలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహిస్తూ రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులను సమీకరించి నల్లగొండలో జరిగే బహిరంగ సభకు తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు చీరిక సంజీవరెడ్డి, జిఎంపిఎస్ రాష్ట్ర నాయకులు కొండే శ్రీశైలం, గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అంతటి అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు చింతల సుదర్శన్, మానేశాలయ్య, యాట బాలరాజు, సిఐటియు జిల్లా నాయకులు ఆదిమూలం నందీశ్వర్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు పొట్ట శ్రీనివాస్, యాట ముత్యాలు, తూర్పునూరు మల్లేష్, రత్నం శ్రీకాంత్, చప్పిడి రాఘవరెడ్డి, ఆకుల ధర్మయ్య, కాటం ఊశయ్య, నీల సత్తయ్య, పిట్టల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

- గూడూరులో 27. 6 కిలోల గంజాయి పట్టివేత



విశాలభారతి, గూడూరు: గురువారం అనగా తేదీ 05.11.2026 న ఉదయం గూడూరు ఎస్సై తన సిబ్బందితో కలిసి కోబల్ తండా X రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, TS 21 T 7453 నంబరు గల తెలుపు రంగు మారుతి కారులో ఒక పురుషుడు మరియు ఒక మహిళ అనుమానాస్పదంగా వస్తుండటాన్ని గమనించారు. వెంటనే అట్టి వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, కారు డిక్కీలో సుమారు 27.6 కిలోల ఎండు గంజాయి లభించింది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.13,82,700/గా అంచనా వేయబడింది. విచారణలో నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చింతూరు ప్రాంతం నుండి గంజాయిని సేకరించి, హైదరాబాద్‌లోని ఒక వ్యక్తికి అందజేసేందుకు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. వెంటనే పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వివరాలు క్రింది విధంగా ఉన్నాయి:

A1) లావుడ్య దేవి @ ఝాన్సీ, భర్త: శివకుమార్, వయస్సు: 36 సంవత్సరాలు, కులం: ఎస్టీ-లంబాడా, వృత్తి: కూలి పని, నివాసం: ఇంటి నం. 417, బోడచక్రు తండా, భూపతిపేట గ్రామం, గూడూరు మండలం, మహబూబాబాద్ జిల్లా.

A2) భూక్య నవీన్, తండ్రి: భంగు, వయస్సు: 24 సంవత్సరాలు, కులం: ఎస్టీ-లంబాడా, వృత్తి: డ్రైవర్, నివాసం: ఇంటి నం. 32, కోరంకుంట తండా, అమీన్‌బాద గ్రామం, చెన్నారావుపేట మండలం, వరంగల్ జిల్లా.నిందితుల వద్ద నుండి అక్రమంగా రవాణా చేస్తున్న 27.6 కిలోల ఎండు గంజాయి, నేరానికి ఉపయోగించిన తెలుపు రంగు మారుతి కారు మరియు రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై నిందితులపై చట్టప్రకారం కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు చేపట్టడం జరిగింది.నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

ప్రజలకు పోలీస్ శాఖ విజ్ఞప్తి

గంజాయిని అక్రమంగా రవాణా చేసే వారు, విక్రయించే వారు, కొనుగోలు చేసే వారు, వినియోగించే వారు మరియు అక్రమంగా నిల్వ ఉంచే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం మరియు నిల్వకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే గూడూరు పోలీసులకు తెలియజేయాలని కోరడమైనది. గంజాయి అక్రమ కార్యకలాపాలపై విశ్వసనీయ సమాచారం అందించిన వారికి తగిన నగదు పారితోషికం అందజేయబడుతుంది. సమాచారం అందించిన వారి పేర్లు మరియు వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి పోలీస్ శాఖకు ప్రజలందరూ సహకరించాలని కోరడమైనది.

చౌటుప్పల్ లో పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

- పట్టణం బాగుండాలంటే ముందుగా పారిశుద్ధ్య కార్మికులు బాగుండాలి
- చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్



చౌటుప్పల్,విశాలభారతి: చౌటుప్పల్ పురపాలక సంఘం కార్యాలయంలో బుధవారం పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి మొగుదాల పావని రమేష్ గౌడ్ చేతుల మీదుగా కార్మికులకు చీరలు, దుస్తులు, గ్లౌజులు, మాస్కులు, సబ్బులు, కొబ్బరి నూనె, బెల్లం, టవల్స్, షూస్, పీపీఈ కిట్లు తదితర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ,పట్టణం బాగుండాలంటే ముందుగా పారిశుద్ధ్య కార్మికులు బాగుండాలి. పట్టణ పరిశుభ్రతలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమైనది. వారి సంక్షేమం, ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వపరంగా అందాల్సిన అన్ని వసతులను కల్పించేందుకు కృషి చేస్తాము. పారిశుద్ధ్య కార్మికులందరినీ నా కుటుంబ సభ్యులుగా భావిస్తూ వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తాను అని తెలిపారు.

అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ, పారిశుద్ధ్య కార్మికులు లేనిదే పట్టణం లేదు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడంలో కార్మికుల సేవలు వెలకట్టలేనివి. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత రక్షణ పరికరాలు తప్పనిసరిగా వినియోగిస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. పట్టణ పరిశుభ్రతకు అంకితభావంతో పనిచేయాలి అని సూచించారు.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు గడ్డం ఇందిరా రాజరత్నం, పిల్లలమర్రి మధుసూదన్, కోఆప్షన్ సభ్యులు పస్తం గంగారామ్, నాయకులు పల్లె సురేందర్ రెడ్డి, ఉడుగు రమేష్, బత్తుల దాసు, దేప రాజు, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఏఈ అంజయ్య, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, జవాన్లు నరసింహ, అంజయ్య, పారిశుద్ధ్య కార్మికులు, వాటర్‌మెన్లు, ఎలక్ట్రీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలి

- యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి



విశాలభారతి ఇబ్రహీంపట్నం: విద్యార్థులు మొబైల్ ఫోన్లు ఇంటర్నెట్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని యాచారం పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ (ఎస్ హెచ్ ఓ) ఎ. నందీశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం యాచారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలు బాలల రక్షణ (చైల్డ్ సేఫ్టీ) పై యాచారం పోలీసులు ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్హెచ్ఓ ఎ. నందీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత ఉపయోగకరమో, అంతే ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీ (ఓటీపీ) లు వ్యక్తిగత వివరాలను ఎవరికీ షేర్ చేయకూడదని విద్యార్థులకు స్పష్టం చేశారు. ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లు, సోషల్ మీడియా వినియోగంలో పరిమితులు పాటించాలని సూచించారు. ముఖ్యంగా బాలల భద్రతకు సంబంధించి, ఎవరైనా వేధించినా లేదా అనుమానాస్పదంగా ప్రవర్తించినా వెంటనే ఉపాధ్యాయులకు లేదా తల్లిదండ్రులకు తెలపాలని కోరారు. ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యాచారం పోలీసు సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాచారం రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదు!

- ల్యాండ్ పూలింగ్ పరిహారంలో కోతపై బిజేపీ ఆగ్రహం
- 1,740 గజాల హామీని 1,400 గజాలకు తగ్గించడం అన్యాయం
- రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం: కొడ్త వేమన




విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ : కుంట్లూర్ డివిజన్ పరిధిలోని బాచారం గ్రామ రైతుల భూములను హెచ్ఎండీఏ ల్యాండ్ పూలింగ్ పేరుతో సేకరించే విధానంపై బీజేపీ కుంట్లూర్ డివిజన్ అధ్యక్షుడు కొడ్త వేమన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు న్యాయమైన పరిహారం అందించకుండా ప్రభుత్వం, హెచ్ఎండీఏ వ్యవహరిస్తున్నాయని ఆయన విమర్శించారు.

పరిహారం తగ్గింపుపై అభ్యంతరం

ఈ సందర్భంగా కొడ్త వేమన మాట్లాడుతూ ల్యాండ్ పూలింగ్‌లో ఎకరానికి 1,740 గజాల అభివృద్ధి చేసిన ప్లాట్ ఇస్తామని తొలుత హామీ ఇచ్చిన హెచ్ఎండీఏ, ప్రస్తుతం దానిని 1,400 గజాలకు తగ్గించడం రైతులకు అన్యాయం చేయడమేనని ఆరోపించారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న విలువైన భూములను ల్యాండ్ పూలింగ్ పేరుతో సేకరిస్తూ రైతులకు తగిన పరిహారం కల్పించడం లేదని విమర్శించారు. రెక్కల కష్టంతో భూములను సాగు చేసుకుంటున్న చిన్న, సన్నకారు రైతులకు నష్టం కలిగించే విధానాలను బీజేపీ సహించదని స్పష్టం చేశారు. బాధిత రైతులకు న్యాయమైన పరిహారం, హామీ ఇచ్చిన మేరకు అభివృద్ధి చేసిన ప్లాట్లు కేటాయించే వరకు రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని, లేనిపక్షంలో బాధిత రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కొడ్త వేమన హెచ్చరించారు.

బేకరీ ప్రారంభోత్సవంలో పొచబోయిన సురేష్ యాదవ్

- నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకుడు



విశాల భారతి, ఎల్.బి.నగర్: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని లెక్చర్స్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బేకరీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పొచబోయిన సురేష్ యాదవ్ పాల్గొని బేకరీ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారి వ్యాపారం మరింత అభివృద్ధి చెంది ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారం చూపాలి

- ట్రాఫిక్ సీఐ, ఆర్‌అండ్‌బీ అధికారులతో కళ్లెం నవజీవన్‌రెడ్డి క్షేత్రస్థాయి పరిశీలన
- వాహనదారులు, స్థానికుల ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



విశాలభారతి, ఎల్.బి.నగర్: హయత్‌నగర్ జాతీయ రహదారిపై నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్ జామ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అధికారులను కోరారు. ఉదయం, సాయంత్రం వేళల్లో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ట్రాఫిక్ సీఐ రమేష్, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి ఆయన జాతీయ రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ రద్దీకి ప్రధాన కారణాలను పరిశీలించి, వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు సమగ్ర ప్రణాళిక రూపొందించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు. హయత్‌నగర్ ప్రజల సౌకర్యమే లక్ష్యంగా ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు నిరంతరం కృషి చేస్తానని కళ్లెం నవజీవన్‌రెడ్డి తెలిపారు.



సూర్యతో మూడు సినిమాలు మిస్

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తోన్న ప్రాజెక్ట్ 'సీన్' (Scene). 'ఆవేశం' ఫేం జీతూ మాధవన్ డైరెక్టర్‌గా కోలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న ఈ చిత్రాన్ని దీపావళి కానుకగా నవంబర్ 6న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ఈ మూవీలో సూర్యకు జోడీగా నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, 'ప్రేమలు' ఫేమ్ మలయాళ యువ నటుడు నస్లెన్ కీలక పాత్రలో కనిపించనున్నాడు.కాగా ప్రమోషనల్ ఈవెంట్‌లో నజ్రియా నజీమ్ ఆసక్తికర విష-యాన్ని షేర్ చేసుకుంది. ఈ భామ ఇప్పటికే సూర్యతో మూడు సినిమాలు చేయాల్సి ఉండగా.. చేయలేదట. మరి సూర్య సినిమాల-కు నో చెప్పిందా అంటే.. అదేమి కాదని చెప్పింది.. కేరళ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మాట్లా-డుతూ.. తాను సూర్య సినిమాలను తిరస్కరించలేదని క్లారిటీ ఇచ్చింది. డేట్ల సర్దు-బాటు, ఇతర షెడ్యూల్ చిక్కుల కారణంగా సూర్య చేసిన సినిమాల్లో నటించలేకపోయా-నని చెప్పింది. అంతేకాదు తమిళ సినిమాలో మళ్లీ నటించేందుకు 12 ఏండ్లు ఎందుకు పట్టిందనే విషయంపై కూడా వివరణ ఇచ్చింది. తమిళ సినిమాలో కమ్ బ్యాక్ ఎంట్రీ ఇచ్చేందు-కు సరైన స్క్రిప్ట్ కోసం ఎదురుచూశానని.. మళ్లీ ఇన్నాళ్లకు సీన్ సినిమాతో వర్కవుట్ అయిందని చెప్పింది. మలయాళ దర్శకుడు జీతూ మాధవన్‌తో తమిళంలో సినిమా చేస్తు-న్న తొలి హీరోయిన్ తానే అవడం హ్యాపీగా ఉందంది. మొత్తానికి నజ్రియా నజీమ్ అలా సూర్యతో రొమాన్స్ చేసే అవకాశం వచ్చినట్టే వచ్చి మిస్ అయిందన్నమాట.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.